PRGI Reg No -“APTEL/26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 150, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 21 - జూలై - 2026 , వెల రూ.5/-

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ

రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు

స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి

తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని

ఢిల్లీ,: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ ‘స్కైరూట్ ఏరోస్పేస్’ను




## కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చొద్దు: సుప్రీంకోర్టు




## పామాయిల్ ధర పెంపునకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది: భట్టి విక్రమార్క




- రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయి
- వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోంది
- అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.

# ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటీకరణ చేస్తున్నారా? సీఎం చంద్రబాబు సమాధానం

- ★ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- ★ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- ★ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ★ ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- ★ రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి




అమరావతి,: రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన, సులభతరమైన సేవలు అందించేందుకే ‘రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు’ (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు” అని తేల్చిచెప్పారు.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ




విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ ఢిల్లీలో ‘చలో సంసద్’ ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్ సమస్యను అంతర్గతంగా చర్చిస్తానని నడ్డా హామీ

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు... ఉభయసభలు నేటికి వాయిదా




నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు

తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా

నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ

## ‘ఎముకలు విరిగిపోతాయి’.. సీఎం విజయ్‌పై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు




చెన్నై: తమిళనాడు సీఎం విజయ్‌ను ఉద్దేశించి బహిరంగ సభలో అభ్యంతరకరమైన, బెదిరింపు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై విలాతికుళం నియోజకవర్గానికి చెందిన డీఎంకే ఎమ్మెల్యే జి.వి. మార్కండేయన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జూలై 20, 2026 తెల్లవారు జామున అరెస్ట్ చేశారు.

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు.. 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం

క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన

ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




హైదరాబాద్, : తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన

## వినాయక చవితి సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ సమితి కీలక పిలుపు




గణేశ్ మండపాల వద్ద జాతీయ జెండా ఎగరేయాలని ఉత్సవ సమితి పిలుపు

సెప్టెంబర్ 17న వందేమాతరం గీతాలాపన చేయాలని సూచన

వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం

హైదరాబాద్, : వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణవ్యాప్తంగా ఉన్న అన్ని గణేశ్ మండపాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, ‘వందేమాతరం’ గీతాన్ని ఆలపించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా,

## పదో తరగతి ఫెయిల్.. గ్రేస్ మార్కులతో పాసయ్యా: మంత్రి నారాయణ




- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- విద్యావ్యవస్థలో లోకేశ్ విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ప్రశంస

# పార్టీ ఎమ్మెల్యేలున్న 41 అసెంబ్లీ స్థానాల్లో పకడ్బందీగా సర్ ప్రక్రియ

- క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద నివేదికలు
- 4 కేటగిరీల కింద చదివి వినిపించిన సీఎం!
- 11 చోట్ల పర్వాలేదనే స్థాయిలో, 14 చోట్ల నిర్లక్ష్యం.. 4 స్థానాల్లో అసలు కాంగ్రెస్ పార్టీ కేడర్ జాడే లేదు
- హుజూర్‌నగర్‌లో నామమాత్రం.. పర్వాలేదనే జాబితాలో ధర్మపురి
- ఆలంపూర్, ఆర్మూర్, ఆసిఫాబాద్,బహదూర్‌పురల్లో అసలు దృష్టే లేదు
- సీఎం హెచ్చరించినా మారని నేతల తీరు




హైదరాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలు, సమన్వయకర్తల నియామకం. గాంధీభవన్‌లో ప్రత్యేక వ్యవస్థ. ‘ఎస్ఐఆర్‌ను సీరియస్‌గా తీసుకోండి.. లేదంటే మీ స్థానంలో కొత్తవారు వస్తారు.. అవసరమైతే మీ జిల్లాలు మార్చేందుకు కూడా వెనుకాడను..’ అంటూ ఎమ్మెల్యేలకు, ఇన్‌చార్జి మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికలు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు డీసీసీ అధ్యక్షుల నుంచి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి సమాచార సేకరణ. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎప్పటికప్పుడు తీసుకుంటున్న చర్యలు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించిన తర్వాత వచ్చిన ఫలితాలు.. ‘ఇవేవీ కూడా అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు పట్టడం లేదు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ‘సర్’పై ప్రత్యేక దృష్టి సారించాలని పార్టీ పక్షాన పదేపదే చెబుతున్నా మంత్రులతో సహా ఎమ్మెల్యేలు కూడా ఖాతరు చేయడం లేదు..’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న నివేదికలు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో మొత్తం 66 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలుండగా,




## తిరుమలకు భారీగా భక్తుల రాక... 31 కంపార్ట్‌మెంట్లు ఫుల్




తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి

శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం

ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## “కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ హాస్టల్లో మెరుగైన విద్య అందిస్తున్నాం ఎంపీపీ వెంకటలక్ష్మి”



పెంటపాడు జులై 20 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, బడుగు బలహీన వర్గాల వారికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సమగ్రమైన కార్యాచరణ రూపొందించామని పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టు బోయిన వెంకటలక్ష్మి అన్నారు. ఈరోజు పెంటపాడు సాంఘిక బాలికల వసతి గృహంలో మరియు పరిమెళ్ళ ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు సంబంధించి దుస్తుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పెద్దపేట వేసి నాణ్యమైన విద్య అందించాలని ఉద్దేశంతో ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంతో ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం లో సంక్షేమ హాస్టళ్లు ను గాలికి వదిలేసిందని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హాస్టల్లో రూపురేఖలు మార్చి నాణ్యమైన విద్య అందిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కసిరెడ్డి మధులత, పెంటపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి, ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణ్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యులు కట్టుబోయిన కృష్ణ ప్రసాద్ హాస్టల్ సంక్షేమ అధికారులు ఎన్.రామలింగం, కే.రామకృష్ణ, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## “గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం”



తాడేపల్లిగూడెం జులై 20 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ) ::::స్థానిక డి.ఆర్.గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సులకు ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయ్యిందని ప్రిన్సిపాల్ డా.కోలా శ్రీమన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రానున్న 2026-27 విద్యా సంవత్సరానికి బి. ఎ. లో తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ , బి.ఎస్సీ లో గణితం, జువాలజీ , కంప్యూటర్స్, ఫిజిక్సు, కెమిస్ట్రీ , బీకామ్ లో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో వివరించారు. అన్ని సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నారని, గత సంవత్సరం అన్ని సబ్జెక్టుల్లో 95 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. డిగ్రీ కోర్సుల ప్రవేశాల కోసం విద్యార్థులు కళాశాల ఆఫీసులో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

## రండి, జూలై 30న శ్రీగిరి గిరిప్రదక్షిణ చేద్దాం

**--- భక్తులకు శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ పిలుపు**



ఒంగోలు, నేటి శుభోదయ :::ఆషాఢ మాసం బహుళ పాఢ్యమి, జూలై 30వ తేదీ గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తియుతంగా, శోభాయమానంగా జరుగుతుందని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్దగల శ్రీ బాపూజీ గోశాల వద్ద గోపూజ నిర్వహించి భక్తులందరూ సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి భక్తులు తమ భుజస్కంధాలపై పల్లకి మోస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ నగరోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంతటి మహిమాన్వితమైన రోజున సకుటుంబ సపరివార సమేతంగా సామూహికముగా శ్రీవారి నామస్మరణ చేస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాల్సిందిగా కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. స్వామివారి నక్షత్రం రోజున సామూహికంగా భక్తి ప్రపత్తులతో శ్రీగిరి గిరిప్రదక్షిణ చేసి శ్రీవారిని దర్శించుకోవడంతో శారీరక మానసిక స్థితి మెరుగై ఆరోగ్యం సిద్ధిస్తుందని, హిందూ సంప్రదాయాలు తెలుస్తాయని, ఐక్యత బలపడుతుందని వివరించారు.

## ఘనంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి జన్మదిన వేడుకలు



చింతూరు, నేటి శుభోదయ ::: రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి పుట్టినరోజు సందర్భంగా, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తూ, ఒక గిరిజన మహిళకు జీవనోపాధి కల్పించే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్‌ను అందజేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష దేవి గిరిజనుల సంక్షేమం, మహిళల సాధికారత, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఎండి జహంగీర్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ నర్సింగరావు,, మార్కెట్ కమిటీ మెంబర్ సాల్మన్ రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తుర్రం చిన్నం ముత్తయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగ మంగ వేణి, మాజీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కారం అచ్చమ్మ, యూనిట్ ఇన్చార్జ్ పొదిలి రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు ఎండి రియాజ్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జగదీష్, బీసీ సెల్ అధ్యక్షుడు ముత్యాల శ్రీరామ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాఫర్, పేగ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడా శ్రీను, భూక్యా మోహన్, చల్లా వెంకటేష్, మహిళా నాయకులు సత్యవతి, రాములమ్మ, టీడీపీ , కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయండి

**అధికారులను ఆదేశించిన చైర్పర్సన్ బల్లాపల్లవి**



అనంత పురం జూలై 20 నేటి శు భోదయ :అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డ్‌లో ఆర్ ఓ ఆర్ వాటర్ ప్లాంట్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా దెబ్బతిన్న 3-ఫేజ్ కేబుల్, 3వ గేట్ ప్రవేశద్వారం వద్ద బ్లాక్ అయిన వాటర్ పైప్‌లైన్, జనరేటర్ మరమ్మతుల పనులను మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి పరిశీలించడం జరిగింది. అవసరమైన మరమ్మతులు, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే చెనిగిత్తనాలు (శనగ గింజలు) విక్రయిస్తున్న రైతులతో చైర్ పర్సన్ బల్లా పల్లవి మాట్లాడడం జరిగింది.

## ఆదివాసి మహా గర్జన సభకు వెళుతున్న ఆదివాసీలను అడ్డగించిన పోలీసులు

**చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించిన ఆదివాసి సంఘం**



చింతూరు, నేటి శుభోదయ ::: రంపచోడవరం లో నిర్వహించే ఆదివాసి మహా గర్జన సభకు చింతూరు డివిజన్ నుండి వాహనాల్లో తరలి వెళ్తున్న ఆదివాసీలను సోమవారం పోలీసులు అడ్డగించినారు. సభకు వెళ్ళనీయకుండా అడ్డుపడటంతో ఆదివాసీలు ఐటిడిఏ కార్యాలయం ముందు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసుల జులం నశించాలని. శాంతియుత సభకు ఆటంకం కలిగించిన అధికారుల తీరుపై ఆదివాసీలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తుందని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై పలువురు తీవ్ర అభ్యంతరం తెలిపినారు. సుమారు గంట సేపు రాస్తారోకో నిర్వహించడంతో రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు స్తంభించినాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు సేసం సురేష్, పులి సంతోష్ మీడియాతో మాట్లాడుతూ తమ ఆదివాసి హక్కులకై శాంతియుత సభను నిర్వహించేందుకు రంపచోడవరం వెళుతున్న వాహనాలను అడ్డుకోవడం అన్యాయమని ఆదివాసీల సభను జరగకుండా ప్రభుత్వం అధికారులను ఆదివాసీలపై ఉసిగొల్పటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తక్షణమే ఐటీడీఏ పీవో స్పందించి ప్రజా సమక్షంలో మహాసభకు అనుమతి ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏ ఎస్ పి బొడ్డు హేమంత్ కుమార్, ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ ఆదివాసి సంఘ నాయకులతో చర్చలు జరిపి మహాసభకు రంపచోడవరం ఆదివాసీలు వెళ్లేందుకు అనుమతులను ఇప్పించారు . దాంతో వాహనాల్లో ఉన్న ఆదివాసి నాయకులు ప్రజలు రంపచోడవరం మహాసభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘం జిల్లా నాయకులు ప్రజానీకం పాల్గొన్నారు.

## అహింస, త్యాగం, ఆధ్యాత్మిక విలువలకు జైన్ గురువులు మార్గదర్శకులు

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-జైన్ గురువుల పవిత్ర పాదాలు గుడివాడ నెలపై తాకడం మా అదృష్టం**



గుడివాడ, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అహింస, త్యాగం, ఆధ్యాత్మిక విలువలకు జైన్ గురువులు మార్గదర్శకులని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. సోమవారం గుడివాడ తొమ్మిదో వార్డు జైన్ స్ట్రీట్ లో చాతుర్మాస దీక్షలో ఉన్న జైన్ మత గురువులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భక్తి పూర్వకంగా కలిశారు. స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జైన్ సంఘ పెద్దలతో కలిసి ఎమ్మెల్యే రాము గురువుల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా తమ సంప్రదాయం ప్రకారం మత పెద్దలు ఎమ్మెల్యే రాము, ఇతర నేతలకు ఎర్ర తలపాగ చుట్టి, పూసల మాలలతో గౌరవ సత్కారం చేశారు. అనంతరం కూటమి నేతలతో కలిసి కొద్దిసేపు మత గురువులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ “అత్యంత కఠిన నియమాలను ఆచరించే జైన్ మత గురువులు గుడివాడకు రావడం మా అందరికీ ఎంతో సంతోషంగా ఉందన్నారు.వారి పవిత్ర పాదాలు మన గుడివాడ నేలపై తాకడం వల్ల మన పట్టణ ఆధ్యాత్మిక ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. అహింస, త్యాగం, నియమ నిష్ఠ, ఆధ్యాత్మిక విలువలను సమాజానికి బోధిస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్న జైన్ మత గురువుల సేవలు నిజంగా ఆదర్శనీయమని కొనియాడారు.చాతుర్మాస దీక్షలు దిగ్విజయంగా జరగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాననీ ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.దీక్ష కాలంలో అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం తరపున కల్పిస్తామన్నారు. గుడివాడలో జైన్ సంఘీయులకు ప్రభుత్వం తరపున వ్యక్తిగతంగా తన సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు.రికాబ్‌చంద్, పుఖరాజ్, పరసమల్,కీర్తి కుమార్ జీవత్, నేమిచంద్, మహేష్ కుమార్,రాజ్ కుమార్,బంటి సంగ్విటిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, జనసేన నాయకులు వేమూరి త్రినాథ్, జైన్ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మహేంద్ర కుటుంబానికి ఒంగోలు నాయి బ్రాహ్మణుల సంఘం లక్షా 20వేల ఆర్థిక సాయం



గుడివాడ, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఇటీవల ఒంగోలులో హత్యకు గురైన గుడివాడ రూరల్ మండలం శేరీ వేల్పూరు నాయి బ్రాహ్మణ సంఘీయుడు గెరిటేపల్లి మహేంద్ర కు ఒంగోలు పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం ఆర్థికంగా అండదండలు అందించిందివృత్తి దారుల సంఘం ఆర్థికంగా అండదండలు అందించన రాష్ట్ర నాయకులు ఉప్పుటూరు బాల గురుస్వామి ఆధ్వర్యంలో మహేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష రూపాయలు ఎఫ్.డి 20వేల రూపాయలు మహేంద్ర తల్లికి నగదు అందజేశారు ఈ సందర్భం ఈ కార్యక్రమంలో లక్ష రూపాయల ఎఫ్డీ ను గుడివాడ కెనరా బ్యాంకులో మహేంద్ర కుమారుడు శీను అందజేశారు. చుండి మహేష్ కుమార్, చిత్తాబత్తుల సాంబశివరావు,చుండి బాబి, మధు,డి. ఆర్. బి. ప్రసాద్, కె.సూరి ఒంగోలు పట్టం నాయకులు కొణిజేటి రామకృష్ణ అజయ్, అబ్రహం బాబు,అబ్రహం బాబు,సురేష్,యోగమూరి, శివ, జైపాల్

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నానమ్మ దశదిన కార్యక్రమం

**హాజరైన గన్ని వీరాంజనేయులు, నేతలు**



ప్రొద్దుటూరు, ఏలూరు, నేటి శుభోదయ :: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నాయనమ్మ పుట్టా పోలమ్మ ‘దశదిన కర్మ’ కార్యక్రమం సోమవారం ప్రొద్దుటూరులో నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్వగృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హాజరై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను, ఆయన తండ్రి సుధాకర్ యాదవ్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ నాయనమ్మ పుట్టా పోలమ్మ జూలై 10న మృతి చెందిన విషయం తెలిసి గత వారం రోజులుగా ఏలూరు పార్లమెంట్ కు చెందిన అనేకమంది నేతలు ఎంపీ ను హైదరాబాద్ నివాసంలో కలిసి పరామర్శించారు. కాగా, సోమవారం ప్రొద్దుటూరులో జరిపిన దశదిన కర్మకు అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సహా, ఏలూరు పార్లమెంట్ కు చెందిన పలువురు నేతలు హాజరై పోలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించి, సంతాపం తెలిపారు. తనను పరామర్శించడానికి వచ్చిన నేతలు, పార్టీ కార్యకర్తలందరినీ పేరు పేరునా పలకరించిన ఎంపీ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ‘నియోజకవర్గ అభివృద్ధిలో వేగం పెంచేందుకే.. క్షేత్రస్థాయి పర్యటన..’

**- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ - గ్రామాలే రాష్ట్రాభివృద్ధికి పునాదులు..’మన ఊరు - మన ఎమ్మెల్యే - మన పల్లెబాట’.. - ఎమ్మెల్యే ‘బత్తుల’..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సుపరిపాలనను ప్రతి ఇంటికి చేరువ చేయడమే లక్ష్యంగా, రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ‘మన ఊరు - మన ఎమ్మెల్యే - మన పల్లెబాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.’ఈ పర్యటనలో భాగంగా ఈ రోజు రాజానగరం మండలం, సీతారామపురం గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ‘గ్రామాభివృద్ధే - రాష్ట్రాభివృద్ధికి పునాది’ అనే నినాదంతో, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఆయన నేరుగా గ్రామ సచివాలయానికి చేరుకున్నారు.గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజల నుండి విద్య , వైద్యం, త్రాగునీరు, వ్యవసాయ, సంక్షేమ పథకాలు వంటి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా వింటూ, వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, ఏ ఒక్కరూ సంక్షేమానికి దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.సీతారామపురం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు. గ్రామంలో పారిశుధ్యం, రోడ్లు, వీధి లైట్లు పరిశీలించి ఎక్కడాకూడా లోపాలకు తావులేకుండా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. భవిష్యత్తులో గ్రామంలో చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యం. పల్లెల్లో ప్రతి సమస్యను పరిష్కరించడమే నా బాధ్యత. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, రాజానగరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఈ పల్లెబాట కార్యక్రమం ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతాయని’ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోసకాయలపల్లిలో రామసేన అధ్యక్షుడు ‘కంబాల’ కానుక.. వనితల వేడుక..’ కు విశేష స్పందన.!!

**- 1300 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలు పంపిణీ..!!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కంబాల కానుక వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు మహిళలు హరతులు పట్టారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. గ్రామాలలోని ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, జయప్రదం చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు 1300 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా మహిళలకు ఉచితంగా పట్టుచీరలను అందించేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని అన్నారు. కులమతాలకు అతీతంగా మూడు నియోజకవర్గాల్లో తమ సేవలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదం, సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. సమాజ సేవే తన లక్ష్యమని అన్నారు. ధర్మాన్ని పాటించేవారి పక్కన ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవ దేశ సేవ..!!

**- ప్రజా సంఘాల తరపున, స్థానిక ప్రజల తరపున భాగ్యలక్ష్మి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.**



( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) దివ్యాంగులకు సేవ చేయడం దేశానికి సేవ చేయడమేనని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ- దివ్యాంగులందరూ కలసి మెలసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకోవడం ఆనందదాయకం అన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగురాలైన ప్రవల్లిక పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అంతా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ సింగిపిల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీ కుమార్ తదితరులు సంఘం తరపున ప్రవల్లికకు బహుమతులను అందజేశారు. పుట్టినరోజు సందర్భంగా ప్రవల్లిక తల్లిదండ్రులు శ్రీ ప్రసాద్ రెడ్డి మరియు వరలక్ష్మి అందరికీ విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ప్రజా సంఘాల తరపున, స్థానిక ప్రజల తరపున భాగ్యలక్ష్మి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో స్ఫూర్తిని నింపుతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో రవి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫటిక లింగ ప్రతిష్ఠాపనకు రూ. లక్ష విరాళం



యాడికి, జూలై 20 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన అభివృద్ధి పనులకు భారీ విరాళం అందింది. ఆలయంలో ప్రతిష్ఠించనున్న స్వామివారి ‘స్ఫటిక లింగం’ కార్యక్రమం కోసం వైఎస్ఆర్ కడప జిల్లా ముద్దనూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన చిలకల గోవర్ధన్ తరపున చంద్రశేఖర్ రూ. 1 లక్ష నగదును ఆలయ కమిటీకి అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. త్వరలోనే స్ఫటిక లింగ ప్రతిష్ఠాపనను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహత్కార్యానికి దాతలు, భక్తులు మరింతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఆలయ అభివృద్ధికి ఉదారంగా లక్ష రూపాయల విరాళం అందించిన చిలకల గోవర్ధన్ కుటుంబ సభ్యులతో పాటు, ఆలయ పనులకు ఆర్థిక సహాయం అందజేసిన దాతలు గుండా నాగరాజు, కండ్లపల్లి రఘునాథ్, జి. దేవేంద్ర, ఎన్. చంద్రశేఖర్, పి. రామాంజనేయులు, రుద్రయ్య, బాల పెద్దయ్య, భార్గవ్, బాలకృష్ణ, హరీశ్, ఓబులేసు, కాసా వెంకటరంగడు, టీ. రామాంజనేయులు, నారాయణస్వామి, సింహం నారాయణ స్వామిలకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. భక్తుల సహకారంతో పనులను వేగవంతం చేసి, ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కన్నులపండువగా జరుపుతామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో పాల్గొన్న...

**- ఆలయ ధర్మకర్త దుంగ దేవన్ రాజు**



( నేటి శుభోదయ జులై : 20 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గం 61వ వార్డులో వెంకన్నపాలెం గ్రామస్తులు ఆషాడమాసం సందర్భంగా ఆదివారం ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమం నిర్వహించి మేళ తాళాలతో.. కోలాటం నృత్యంతో.. టపాకాయలు బాణాసంచాలతో.. తల్లికి స్వాగతం పలుకుతూ.. అంగరంగ వైభవంగా మల్కాపురం శ్రీ శ్రీ శ్రీ మరిడిమాంబ పండగ ఊరేగింపును భక్తులు ప్రారంభించారు, దేవాలయానికి చేరుకుని తల్లికి పసుపు , కుంకుమలు , పిండి వంటలతో కూడిన సారి , చీర , పూలదండలు , ప్రసాదాలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహించారు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఆలయ ధర్మకర్త మరియు 61వ వార్డు, జనసేన పార్టీ



అధ్యక్షులు దుంగ దేవన్ రాజు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆయన మాట్లాడుతూ.. గత 5 సంవత్సరం నుండి ఆషాడ మాసంలో 61 వ వార్డు గ్రామ ప్రజలు , స్థానికులు అందరూ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు, ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో ఉండాలని మరియు గ్రామ దేవత మరిడిమాంబ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని తల్లిని ప్రార్థించారు , ఈ కార్యక్రమంలో .. పి ఎం జి అసోసియేషన్ మహిళా ఇన్చార్జ్ రెడ్డి దేవి , రెడ్డి వర , లావణ్య , మాలతి , రెడ్డి లక్ష్మి , శేషగిరి మాస్టారు , సత్యాల సన్యాసిరావు , పరదేశి నాయుడు , కోలాటం బృందం , యువతీ యువకులు , మహిళా సేవాదళ్ , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి..!!

**- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని టూటౌన్ సీఐ బి.అప్పల నాయుడు అన్నారు.**



( నేటి శుభోదయ జులై : 20 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఇతర ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు డాబాగార్డెన్స్ ఆదిత్య కళాశాలలోని శనివారం ఉదయం 'డ్రగ్స్ వద్దు బ్రో ' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా వ్యసనాలకు, ఇతర అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాలకు లోనైతే భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, చదువుతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. వ్యసనాల బారిన పడిన వారికి అండగా నిలిచి, వారిని తిరిగి కలుపుకోవాల్సిన బాధ్యత అందరి పై ఉందని సీఐ అప్పల నాయుడు పేర్కొన్నారు. విద్యార్థినులకు శక్తి యాప్ ఆవశ్యకతపై కూడా అవగాహన కల్పించారు. ప్రతి మహిళ చేతిలో శక్తి యాప్ ఒక ఆయుధంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ కే. శ్రీలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు మరియు యువ క్రీడాకారులకు అమూల్యమైన సందేశం

**- ఇషా గ్రామోత్సవం ముగింపు వేడుకలలో వైజాగ్ సిటీ పోలీస్ కమిషనర్, పాల్గొని యువతకు మరియు క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమైన సందేశం అందించారు.**



( నేటి శుభోదయ జులై : 20 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) బోయపాలెంలోని వాగ్దేవి విద్యా మందిర్ వేదికగా జరిగిన 'ఇషా గ్రామోత్సవం 2026' క్లస్టర్ స్థాయి పోటీల ముగింపు వేడుకల్లో, మీ మధ్య నిలబడటం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. మైదానంలో మీ శక్తిని, క్రమశిక్షణను, మరియు ఆటపై మీకున్న అంకితభావాన్ని చూస్తుంటే.. మన దేశ భవిష్యత్తుపై నా గుండెల్లో ఒక గొప్ప నమ్మకం, ఆశ చిగురిస్తున్నాయి.క్రీడలు అంటే కేవలం గెలవడం లేదా ఓడిపోవడం మాత్రమే కాదు; అది మన జీవితాన్ని మలచుకునే ఒక అద్భుతమైన మార్గం.మన యువత మరియు క్రీడాకారులు తమ జీవితంలో ముందుకు తీసుకెళ్లాల్సిన మూడు ముఖ్యమైన విలువల గురించి సీపీ మాట్లాడారు.వ్యసనాలకు దూరం – క్రమశిక్షణే మార్గం: మీరు వాలీబాల్ మరియు త్రోబాల్ కోర్టులలో చూపించిన క్రమశిక్షణ, జట్టుకృషి (టీమ్‌వర్క్) మరియు ఏకాగ్రతలే.. మీ జీవితాన్ని విజయవంతంగా నిర్మించుకోవడానికి ఉపయోగపడే నిజమైన ఆయుధాలు. యువత తమ అపారమైన శక్తిని క్రీడల వైపు, చదువు వైపు మళ్లించినప్పుడు.. చెడు అలవాట్లకు, వ్యసనాలకు లేదా సమాజానికి నష్టం కలిగించే పనులకు అక్కడ అస్సలు చోటుండదు. మిమ్మల్ని చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఆపే ఒక రక్షణ కవచంలా క్రీడలను ఉపయోగించుకోండి.పోరాట పటిమ (రెసిలియన్స్) ఆటలో ఒక పాయింట్ కోల్పోయినంత మాత్రాన మీరు ఆడటం ఆపరు; తదుపరి పాయింట్ కోసం ఇంకాస్త పట్టుదలగా పోరాడుతారు. జీవితం కూడా మనకు సవాళ్లను, అపజయాలను, కష్టాలను ఎదురుచూపుతుంది. అసలైన విజేతలు అంటే ఎప్పుడూ ఓడిపోని వారు కాదు..

కింద పడిన ప్రతిసారీ రెట్టింపు ఉత్సాహంతో తిరిగి పైకి లేచేవారే నిజమైన విజేతలు. ఆ మానసిక దృఢత్వాన్ని మీలో పెంపొందించుకోండి.మన మూలాలను గౌరవించడం ఇషా గ్రామోత్సవం మనకు గుర్తుచేస్తున్నట్లుగా, భారతదేశం యొక్క అసలైన ఆత్మ మన గ్రామాల్లోనే ఉంది. అన్ని బేధాలను తుడిచిపెట్టి, సమాజాన్ని ఒకటిగా కలిపి, సంతోషాన్ని పంచే అద్భుతమైన శక్తి క్రీడలకు ఉంది. ఆదివారం ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా, మీరు కేవలం ఒక ఆట ఆడటమే కాదు.. మన గ్రామీణ భారతదేశం యొక్క సజీవ సంస్కృతిని, సామరస్యాన్ని కాపాడుతున్నారు.ఈ బహుమతులు సాధించిన విజేతలందరికీ నా హృదయపూర్వక అభినందనలు! మన యువతను సాధికారత వైపు నడిపించే ఇలాంటి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం మా పోలీస్ శాఖకు ఎప్పుడూ గర్వకారణం. ఆటలను కొనసాగించండి, ఆరోగ్యంగా ఉండండి, క్రమశిక్షణతో మెలగండి.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం వద్ద అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో విశాఖ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు.

**ఉత్తరాంధ్ర విమానయానంలో అతిపెద్ద మైలురాయికి కౌంట్ డౌన్ మొదలైంది.**



రాజేంద్ర నగర్,20 జులై(నేటి శుభోదయ):అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరుపెట్టిన సరికొత్త విశాఖ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ1ఆగస్టు 2026న జాతికి అంకితం చేసేందుకు సిద్ధం కావడంతో,విశాఖ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అధికారికంగా సమయం దగ్గర పడుతోంది.ఈ ప్రారంభోత్సవం భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వైమానిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకదాని పరిపూర్ణతను సూచిస్తుంది.ఉత్తర కోస్తా ఆంధ్రకు అనుసంధానం,ఆర్థిక వృద్ధి,ప్రాంతీయ అభివృద్ధిలో మెరుగైన ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది.జీఎంఆర్ ఎయిర్పోర్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్)ఈ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని పెరుగుతున్న ఈ ప్రాంత విమానయాన అవసరాలు తీర్చే విధంగా రూపొందించింది.ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణీకులు (ఎంపీపీఏ) ప్రయాణించే సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ విమానాశ్రయం భవిష్యత్తులో దశల వారీగా 4 కోట్ల ఎంపీపీఏలకు పైగా వీలు కల్పిస్తుంది.విమానాశ్రయంలో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్వే,ఆధునిక ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్,ప్రత్యేక కార్గో సౌకర్యాలు,ఆధునిక విమానయాన ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి.దేశీయ,అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించగల సామర్థ్యం వీటికి ఉంటుంది.వాణిజ్య కార్యకలాపాలకు సంసిద్ధతను ప్రదర్శిస్తూ,ఈ విమానాశ్రయం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్)నుంచి భద్రతా మదింపు పరిశీలన ఆమోదాలు,ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐసీపీ)గా నోటిఫికేషన్,కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 8 కింద కస్టమ్స్ నోటిఫికేషన్,ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి దీన్ని నిర్వహించడానికి అనుమతి (సీటీఓ)తో పాటు,సంబంధిత నియంత్రణ అధికారుల నుంచి ఇతర తప్పనిసరి కార్యాచరణ ఆమోదాలతో సహా అన్ని ప్రధాన చట్టబద్ధమైన,నియంత్రణ అనుమతులను పొందింది.ఈ ఆమోదాల వల్ల ప్రారంభోత్సవం జరిగిన వెంటనే షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది.విశాఖ సమీపంలో భోగాపురం దగ్గరున్న విమానాశ్రయం విశాఖపట్నం,విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్గఢ్లోని పొరుగు జిల్లాలకు ప్రాథమిక విమానయాన మార్గంగా ఉంటుంది. ప్రధాన దేశీయ, అంతర్జాతీయ గమ్యాలను చేరుకోవడంలో చెప్పుకోదగిన మెరుగుదల తీసుకువస్తుంది. పర్యాటకం,వాణిజ్యం, లాజిస్టిక్స్, తయారీ, పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్తర కోస్తా ఆంధ్రలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నారు.ప్రారంభోత్సవానికి ముందే,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం,దాని సమీప జిల్లాలతో విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను వేగవంతం చేశాయి.ఏడు అప్రోచ్ రోడ్లు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచాయి. హైవే కనెక్టివిటీ విమానాశ్రయానికి ప్రయాణీకులు వచ్చిపోయేందుకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అత్యంత సౌకర్యంగా ఉంటుంది.ప్రయాణీకులకు కనెక్టివిటీ కల్పించడమే కాకుండా,ఈ విమానాశ్రయం దీర్ఘకాలంలో ఆర్థిక అభివృద్ధికి ప్రేరకంగా పనిచేస్తుందని ఆశిస్తున్నారు.కార్గో ప్రాథమిక సౌకర్యాలు, పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలో ఉండడం, లాజిస్టిక్స్ సామర్థ్యం మెరుగుగా ఉండడంతో,సమాచార సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సముద్ర ఆహార ఎగుమతులు, ఆధునిక తయారీ వంటి ఎదుగుతున్న రంగాలకు మద్దతుగా ఉంటుంది. సమర్థవంతమైన,సుస్థిరమైన,భవిష్యత్తుకు సన్నద్ధంగా ఉండే కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే విధంగా, పునరుత్పాదక శక్తి, వర్షపు నీటి సేకరణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు,పర్యావరణ బాధ్యతాయుత మౌలిక సదుపాయాలను పొందుపరుస్తూ, సుస్థిరతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఈ విమానాశ్రయం అభివృద్ధి చేయడం జరిగింది. తుది సన్నాహాలు చివరి దశకు చేరుకోవడంతో,విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని, కార్యకలాపాల నిర్వహణ ప్రారంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు, విమానాశ్రయ భాగస్వాములు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో కృషి చేస్తున్నారు.అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ విమానయాన ప్రస్థానంలో చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచిపోతుంది.ఇది ప్రయాణీకులకు, వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు నూతన అవకాశాలను సృష్టించడంతోపాటు, విశాఖపట్నంను "తూర్పు ముఖద్వారం"గా, తూర్పు భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మరింత బలోపేతం చేస్తుందన్నారు.



## టీడీపీ నాయకుడి ఒత్తిడితో కేసు పెట్టారు

**అవమానాన్ని తట్టుకోలేక ఆలమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి అంకే నరేంద్ర ఆత్మహత్యాయత్నం..నా చావుకు టీడీపీ నాయకుడు గ్రామానికి చెందిన గోనుగుంట్ల సూర్యనారాయణ కారణం'. రాజకీయ కక్షతో కేసు పెట్టించారంటూ ఆవేదన..'నా పరువును బజారున పడేశారు' అంటూ వీడియోలో ఆవేదన. సెల్ఫీ వీడియో రికార్డు చేసిన అనంతరం పురుగుమందు తాగిన వైనం.అనంతపురం నగరంలోని సవీరా ఆస్పత్రిలో చికిత్స.. పరిస్థితి విషమమని వైద్యుల వెల్లడి. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలింపు బెంగళూరులో దగ్గరుండి అంకే నరేంద్రను ఆస్పత్రిలో చేర్పించిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి..!**



అనంత పురం బ్యూరో జూలై 20 నేటి శుభోదయ:అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకుడి ఒత్తిడి మేరకే అనంతపురం రూరల్ పోలీసులు తనపై దొంగతనం కేసు నమోదు చేశారని మనస్తాపానికి గురైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అంకె నరేంద్ర సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యాయత్నానికి ముందు తన అరటి తోటలో సెల్ఫీ వీడియో రికార్డు చేసిన నరేంద్ర, అందులో తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ పలు ఆరోపణలు చేశాడు. సెల్ఫీ వీడియోలో నరేంద్ర మాట్లాడుతూ, తన పేరు అంకె నరేంద్ర అని, అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన వాల్మీకి కులానికి చెందిన వ్యక్తినని తెలిపాడు. తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, దీనిని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తనను కక్షపూరితంగా వేధిస్తున్నారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా దొంగ ఓట్లు ఎక్కిస్తున్నాడని తెలుసుకుని తాను వెళ్లి అడ్డుకున్నా. అప్పటి నుంచే తనపై కక్ష పెంచుకున్నాడు. అదే కక్షతో అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో తనపై దొంగతనం కేసు నమోదు చేయించాడు. వాస్తవానికి జగనన్న కాలనీకి చెందిన కాంట్రాక్టర్ రమణారెడ్డి సూచనల మేరకే జగనన్న కాలనీలో ఉన్న మోటారును రిపేర్ చేయించేందుకు తీసుకెళ్లా. రిపేర్ అనంతరం తన పొలంలో టెస్టింగ్ కోసం మాత్రమే దింపా. అయితే హౌసింగ్ ఏఈ సంపత్‌కుమార్‌తో ఫిర్యాదు ఇప్పించి తానే మోటారు దొంగిలించినట్లు కేసు బనాయించారు.మా కుటుంబం గౌరవంగా జీవిస్తోంది. అలాంటి కుటుంబానికి చెందిన తనను పోలీసులు ముసుగు ధరింపజేసి ఫోటోలు తీసి మీడియాలో ప్రచారం చేయడంతో తమ కుటుంబ పరువు బజారున పడింది. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తండ్రి గతంలో మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారని కూడా పేర్కొన్నాడు.తన చావుకు ప్రధాన కారణం గోనుగుంట్ల సూర్యనారాయణేనని ఆరోపించిన నరేంద్ర, బేల్దారి పని చేసుకునే ఆయన తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లాది రూపాయలు సంపాదించాడు. గ్రామంలో బీసీలు ఎదుగుతుంటే వారిని ఏదో ఒక విధంగా తొక్కేస్తున్నాడు. హద్దుల ప్రకారమే నిర్మించుకున్న తమ ఇంటి కాంపౌండ్‌ను రోడ్డుకు వచ్చిందనే పేరుతో కూల్చివేయించాడు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను వేధిస్తున్నారు. తలెత్తుకుని తిరగనీయడం లేదు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరినీ బతకనివ్వరు. ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరుడైన గోనుగుంట్ల సూర్యనారాయణ గ్రామంలో అనేక దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడు. జగనన్న కాలనీలో మట్టి, గునాదులను అమ్ముకున్నాడని ఆరోపిస్తూ, అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, తాను మోటారును రిపేర్ చేయించి టెస్టింగ్ కోసం తన తోటలో దింపితే దొంగతనం కేసు బనాయించారు. తన పరువును బజారుకు ఈడ్చి నానా రకాలుగా అవమానించడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నానని వీడియోలో పేర్కొన్న అనంతరం, తన అరటి తోటలో వ్యవసాయ పంటలకు ఉపయోగించే పురుగుమందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న నరేంద్రను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు..



## సౌత్ సబ్ డివిజన్ -- క్రైమ్ రివ్యూ సమావేశం అండ్ శిక్షణ కార్యక్రమం..!!





( నేటి శుభోదయ జులై : 20 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) సౌత్ సబ్ డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో, ఏసీపీ క్రైమ్స్ వెంకట్రావు అధ్యక్షతన గాజువాక, దువ్వాడ మరియు స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ల సిబ్బందితో సమీక్షా సమావేశం మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ, గాజువాక, దువ్వాడ మరియు స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా సిబ్బంది అందరూ సమన్వయంతో, టీమ్‌వర్క్‌తో విధులు నిర్వహించాలని, ప్రజల ఆస్తులు దొంగలపాలు కాకుండా సమర్థవంతమైన నిఘా, రాత్రి బీట్లు, పెట్రోలింగ్‌ను మరింత పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు.అలాగే, నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ప్రజల్లో విస్తృత స్థాయిలో క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ముందస్తు నేర నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం డోర్–టు–డోర్ అవగాహన కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, ఆస్తుల రక్షణ వంటి అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని, కేసులు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.అదేవిధంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత గల వ్యక్తులు, పాత నేరస్థులు మరియు అనుమానితులపై నిరంతర నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశం అనంతరం సిబ్బంది ఎదుర్కొంటున్న విధి నిర్వహణకు సంబంధించిన సమస్యలను ఏసీపీ తెలుసుకొని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.సౌత్ సబ్ డివిజన్‌లోని మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది సమష్టిగా పనిచేసి, సమర్థవంతమైన పెట్రోలింగ్, రాత్రి బీట్లు, క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ, ప్రజలతో సత్సంబంధాల పెంపు ద్వారా నేర నియంత్రణలో విశేష కృషి చేసి, విశాఖపట్నం నగరాన్ని మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఏసీపీ పిలుపునిచ్చారు.అనంతరం, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.డి. బాబు నూతన చట్టాలు, ఆంధ్రప్రదేశ్ పోలీస్ మాన్యువల్ మరియు విధి నిర్వహణలో అనుసరించాల్సిన నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తూ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని గాజువాక, దువ్వాడ మరియు స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ జి.డి. బాబు ఎస్ఐ హరికృష్ణ ఎస్ఐ సత్తిబాబు, ఎస్ఐ సాంబశివరావు తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 85 వినతులు..

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 85 వినతులు వచ్చాయని జీవీఎంసీ అదనపు కమిషనర్లు డివి రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ పేర్కొన్నారు. సోమవారం వారు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 85 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 02, మధురవాడ జోన్ కు 17, ఈస్ట్ జోన్ కు 09, వెస్ట్ జోన్ కు 05, నార్త్ జోనుకు 15, సౌత్ జోన్ కు 07, పెందుర్తి జోన్ కు 09, అగనంపూడి జోన్ కు 1, గాజువాక జోన్ కు 14, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 06 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జోనల్ అడ్మినిస్ట్రేషన్ కు 01, రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 09, పట్టణ ప్రణాళిక విభాగమునకు 41, ఇంజినీరింగు విభాగమునకు 20, డిడిహెచ్ విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 01 కలిపి మొత్తంగా 85 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు జోనల్ స్థాయి అధికారులు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో



సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి జోనల్ కమీషనర్లను, అధికారులను అదరపు కమిషనర్లు ఆదేశించారు. పురమిత్ర, పి జి ఆర్ ఎస్ లో నమోదైన పిర్యాదులను కూడా అధికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించాలన్నారు. జోనల్ కమీషనర్ లు, జోనల్ అధికారులు నిత్యం మధ్యాహ్నం 3 నుండి 5 వరకు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, సీసీపీ ఏ ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, యుసిడి పి.ఒ- పి.ప్రసన్న వాణి, డిపిఒ జి.నాగార్జునరావు, శాంత కుమారి, ఫైర్ ఆఫీసర్, డిసిపి లు, ఎసిపి లు బయాలజిస్ట్ సాంబమూర్తి, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## "గూడెంలో ఈనెల 26న" భజన క్లబ్బింగ్ "భక్తి సంగీత కార్యక్రమం"



తాడేపల్లిగూడెం జూలై 20 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::ప్రపంచ ప్రఖ్యాత 'ఆర్ట్ ఆఫ్ వింగ్ 'సంస్థ వ్యవస్థాపకులు పండిట్ రవిశంకర్ గురూజీ స్ఫూర్తి తో తాడేపల్లిగూడెంలో 'భజన క్లబ్బింగ్ ' ఆధ్యాత్మిక, సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యోగ గురు చిక్కాల అంబిక తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వాహక మహిళా బృందం స్థానిక సాలిపేట,అంబిక నివాసం లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంబిక మాట్లాడుతూ స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో జూలై 26న సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి కలవారు వివరాల కోసం ఫోన్ :9441448017 నెంబర్ కు సంప్రదించవచ్చని తెలిపారు.భారతీయ సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక విలువల గురించి నేటి తరానికి అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఇతర పెద్దల ఆశీస్సులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. భక్తి సంగీతాల కలయికతో ప్రజలందరికీ ఒక గొప్ప హృదయానుభూతిని కలిగించే విధంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమ నిర్వాహక బృంద సభ్యురాలు చలంచర్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నిత్యం జీవితంలోఎదుర్కొనే అనేక ఒత్తిళ్లను అధిగమించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు, గృహిణులు,ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ రంగాలలో ఉన్న వారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అత్యున్నత భారతీయ ఆధ్యాత్మిక విలువలను గ్రహించాలని అన్నారు. అనేక రంగాలలో అగ్రస్థానంలో ఉన్న తాడేపల్లిగూడెం పట్టణం ఆధ్యాత్మికంగా కూడా ఉన్నత స్థానం పొందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గతనెల రోజులుగా పదిమంది మహిళలు బృందం గా ఏర్పడి ఎంతో శ్రమతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశామని అన్నారు.భగవాన్నామస్మరణ, ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతిని సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో కార్యక్రమ నిర్వాహక బృంద సభ్యులు కారుమూరి సునీత, యలమర్తి సత్య భాస్కరి, తుమ్మలపల్లి అవంతి, పచ్చి పులుసు శారదా రాణి, వానపల్లి సునీత, నార్కెడిమిల్లి భారతి,నున్న శ్రీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## "హరిత విశాఖ -- 50 పార్కుల మిషన్"కు శ్రీకారం..

**జీవీఎంసీ పరిధిలో 50 ఆధునిక పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

**ఇప్పటికే 47 ఓపెన్ స్పేస్‌ల గుర్తింపు... తొలి దశలో రూ.21.97 కోట్లతో 47 పార్కుల అభివృద్ధి- ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం, పిల్లల ఆటవిడుపుకు అన్ని ఆధునిక మౌలిక సదు పాయాలతో హరిత పార్కుల ఏర్పాటు- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



( నేటి శుభోదయ జులై :21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరాన్ని మరింత హరితమయం చేసి, ప్రజలకు ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు జీవీఎంసీ పరిధిలో 50 ఆధునిక పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని గుర్తించిన ఓపెన్ స్పేస్‌లలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఉదయం, సాయంత్రం వాకింగ్, యోగా, వ్యాయామం నిర్వహించేందుకు, చిన్నారుల ఆటలు, కుటుంబ సభ్యుల విహారం, సీనియర్ సిటిజన్ల విశ్రాంతి, పర్యావరణ పరిరక్షణకు అనువుగా అన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో హరిత పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.జీవీఎంసీ పరిధిలో మొత్తం 50 పార్కులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, తొలి దశలో ఇప్పటికే 47 ఓపెన్ స్పేస్‌లను గుర్తించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. మిగిలిన పార్కులకు అవసరమైన అనువైన స్థలాలను కూడా గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో భీమునిపట్నం జోన్‌లో 7 పార్కులు, మధురవాడ జోన్‌లో 20 పార్కులు, గాజువాక జోన్‌లో 20 పార్కులు, మొత్తం 47 పార్కులను రూ.21.97 కోట్ల (రూ.2,196.75 లక్షలు) అంచనా వ్యయంతో జీవీఎంసీ నిధుల ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.ఈ పార్కుల్లో అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌లు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక విశ్రాంతి వేదికలు, పచ్చిక బయళ్లు, సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్, అలంకార మొక్కలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, బెంచీలు తదితర ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.హరిత పార్కుల అభివృద్ధి ద్వారా నగరంలో పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి సంరక్షణ, ప్రజల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు విశేషంగా దోహదపడుతుందని, చిన్నారులకు సురక్షితమైన ఆట స్థలాలు, కుటుంబాలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని కమిషనర్ పేర్కొన్నారు."గ్రీన్ -- హెల్తీ -- లైవబుల్ విశాఖ" లక్ష్య సాధనలో భాగంగా జీవీఎంసీ చేపడుతున్న 50 పార్కుల అభివృద్ధి కార్యక్రమం నగర పర్యావరణ పరిరక్షణకు, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని కమిషనర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పార్కుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

## గుడ్లవల్లేరులో ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం

**- నలుగురు నిందితుల అరెస్ట్ -15 లక్షల 38 వేల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం -నిందితుల్లో ఇద్దరు హిజ్రాలు**

**-ఆనవాళ్లు లేకుండా దొంగతనం చేసిన ప్రదేశంలో కారం చల్లిన నిందితులు**

**-4 రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు - అభినందించిన డీఎస్పీ**




గుడివాడ, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) బంగారు ఆభరణాలు నగదును దోచుకున్న నలుగురిని గుడ్లవల్లేరు పోలీసులు నాలుగు రోజుల్లో కేసును చేధించారు.కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం ఎన్టీఆర్ కాలనీలో జరిగిన బంగారు దోపిడీ కేసును పోలీసులు 4 రోజుల్లో ఛేదించారు.

సోమవారం గుడివాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన గుడ్లవల్లేరు గ్రామంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన పోలగాని నాగేశ్వరమ్మ ఇంటి తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఈ మేరకు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సత్యనారాయణ నేతృత్వంలోని బృందం నిందితులను గుర్తించి నలుగురిని అరెస్ట్ చేశారు.

వారిలో ఇద్దరు హిజ్రాలు ఉన్నారు. నిందితుల నుంచి 15 లక్షల 38 వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారని డిఎస్పీ పాల శ్రీనివాస్ చెప్పారు.దొంగతనం చేసిన అనంతరం ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ఆ ప్రదేశంలో కారం చల్లినట్లు డీఎస్పీ తెలిపారు.

కేసును వేగంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ పాల శ్రీనివాసరావు అభినందించారు.

## జూలై 25,26 న విశాఖలో ఎలైట్ క్రికెట్ లీగ్..!!

**- జెర్సీ విడుదల చేసిన గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు**




( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక టిడిపి కార్యాలయంలో గాజువాక శాసనసభ్యులు మరియు టిటిడి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎలైట్ క్రికెట్ లీగ్ జెర్సీ ని విడుదల చేసారు. నిర్వాహకులు ఉదయచంద్రారెడ్డి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావుకి బాజపా కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై నెల 26,27 శని ఆదివారాల్లో విశాఖపట్నంలోని పియం పాలెం స్టేడియంలో క్రికెట్ పోటీలు జరుగుతాయని తెలిపారు. మొదటి రోజు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల మధ్య , ఆదివారం టీవీ,సినీ ప్రముఖులు, డాక్టర్లు అధికారుల మధ్య క్రికెట్ పోటీలు జరుగుతాయని తెలిపారు. దీని ద్వారా వచ్చే ఆదాయం జవాన్లు,అమర వీరుల కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సింహాచలం ప్రత్యేక ఆహ్వానితులు బీజేపి నాయకులు దక్షిణామూర్తి, బీజేపి ధార్మిక పరిషత్ అధ్యక్షులు ఫణీంద్రా,జోనల్ కమీషనర్ శేషాద్రి తదితరులు ఉన్నారు.

## - అంగరంగ వైభవంగా ప్రారంభమైన సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు



ఒంగోలు, నేటి శుభోదయ ::: స్థానిక పత్తి వారి వీధిలోని శ్రీకృష్ణ సీతారామ భజన మందిరంలో సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుద్ధ సప్తమి 20 జూలై సోమవారం నుండి కృష్ణపక్ష ఏకాదశి ఆగస్టు 9 వరకు లోక కళ్యాణార్థం సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు జరుగుతాయని శ్రీరామ బాలభక్త సమాజం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమం విశేషాలు తెలుపుతూ జూలై 26వ తేదీ ఆదివారం మూలా నక్షత్ర యుక్త అభిజిత్ లగ్నంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణమును వేదపండితులు శాస్త్రోక్తంగా జరుపుతారని, 20వ తేదీ సోమవారం అంకురార్పణ మరియు చప్పరోత్సవం, 21వ తేదీ శేషవాహనం, 22న హంస వాహనం, 23న హనుమంత వాహనం, 24న గరుడ వాహనం, 25న గజ వాహనం సాయంత్ర గ్రామోత్సవం, 26న కళ్యాణం, 27న సామ్రాజ్య పట్టాభిషేకం, 28న అశ్వవాహనం, 29౼ 30న గిన్నెకాసు ఆగస్టు 1న ఏకాంతసేవ, 2న మధ్యాహ్నం అన్నకోటి ఉత్సవం, 3న ఏకాంతసేవ, 4న పదహారు రోజుల పండుగ మరియు ఆగస్టు 9 ఆదివారం సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కనుక పెద్ద సంఖ్యలో భక్తులు మందిరానికి వచ్చి స్వామివారి వేడుకలు తిలకించి సీతారాముల కృపకు పాత్రులు కావాలని శ్రీరామ బాలభక్త సమాజం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహణ



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:పోలవరం జిల్లా చింతూరు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నాడు విద్యార్థులు కోసం ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించబడింది.ఈ శిబిరంలో వైద్య బృందం పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించింది. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత మరియు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు,ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కె.రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఫిజిక్స్ అధ్యాపకులు భరత్, కెమిస్ట్రీ అధ్యాపకులు గణేష్, కామర్స్ అధ్యాపకులు భూలక్ష్మి,ఏకనామిక్స్ అధ్యాపకులు అప్పల నాయుడు,తెలుగు అధ్యాపకులు సుశీల,బోటనీ అధ్యాపకులు రాము, మ్యాథ్స్ అధ్యాపకులు శివ, హిస్టరీ అధ్యాపకులు దుర్గా ప్రసాద్, ఆంగ్లం అధ్యాపకులు చంద్రశేఖర్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కు విశేష స్పందన




గుడివాడ, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రోటరీ క్లబ్ నిర్వహించే ఉచిత వైద్య శిభిరాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వినియోగించుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుళ్ళపల్లి కిరణ్ బాబు కోరారు. సోమవారం కీర్తిశేషులు డాక్టర్ తీపిర్నేని లక్ష్మీ పెరుమాళ్ళు సతీమణి కీర్తిశేషులు ప్రభావతి, చలసాని చౌదరి రాయన్ ల స్మారకార్ధం సిద్ధార్థ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ సహకారంతో స్థానిక కోతి బొమ్మ సెంటర్ ప్రభావతి గార్డెన్స్ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో 54 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు రక్త పరీక్షలు చేయడంతో పాటు చికిత్సకు ఉచితంగా మందులు అందజేశారు. కార్డియాలజీ విభాగానికి డాక్టర్ స్నిగ్ధ,న్యూరాలజీ విభాగం డాక్టర్ దీపక్ తమ వైద్య సేవలను అందించారు. హాస్పిటల్ వైద్య సిబ్బంది, విఆర్ఓ శ్రీ స్వామి సహాయ సహకారాలు అందించారు.

గుడివాడ రోటరీ కార్యదర్శి గండు నరేష్, పూర్వాధ్యక్షులు టి ఎన్ రాజశేఖర్, బలుసు శంకర్రావు, డాక్టర్ సిహెచ్ సూర్యచంద్రరావు, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు, పొన్నూరు రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఏ మారుతి కుమార్, సాగిరాజు ఉదయభాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే శిరీష దేవి జన్మదిన వేడుకలు



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి జన్మదిన సందర్భంగా సోమవారం చింతూరు మండల టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తూ, ఒక గిరిజన మహిళకు జీవనోపాధి కల్పించే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్‌ను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష దేవి గిరిజనుల సంక్షేమం, మహిళల సాధికారత మరియు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జమాల్ ఖాన్,మాజీ మండల అధ్యక్షుడు ఎండి జహంగీర్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ నర్సింహరావు, మార్కెట్ కమిటీ మెంబర్ సాల్మన్ రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తుర్రం చిన్నం ముత్తయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగ మంగ వేణి, మాజీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కారం అచ్చమ్మ, యూనిట్ ఇన్చార్జ్ పొదిలి రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు ఎండి రియాజ్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జగదీష్, బీసీ సెల్ అధ్యక్షుడు ముత్యాల శ్రీరామ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాఫర్, పేగ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడా శ్రీను, భూక్య మోహన్, చల్లా వెంకటేష్, మహిళా నాయకులు సత్యవతి, రాములమ్మ, టీడీపీ నాయకులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ టూక్ అల్ మర్రీ

**ఘన స్వాగతం పలికిన గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం**



విజయవాడ,జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ,,) విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, గన్నవరం వద్ద యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హిజ్ ఎక్సలెన్సీ అబ్దుల్లా బిన్ టూక్ అల్ మర్రీ సోమవారం ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి జి. బాల సుబ్రహ్మణ్యం విమానాశ్రయంలో మంత్రివర్యులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, రాష్ట్ర ప్రభుత్వ తరపున స్వాగతం తెలిపారు.అనంతరం సంబంధిత అధికారులు ప్రోటోకాల్ ప్రకారం స్వాగత కార్యక్రమాలను నిర్వహించి, గౌరవ అతిథికి అవసరమైన ఏర్పాట్లు కల్పించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయ అధికారులు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన 43వ నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం

**-సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్.ఏలూరు కాలువకు ప్రస్తుతం ఇస్తున్న 800 క్యూసెక్కుల నీటిని 1,200 క్యూసెక్కులకు పెంచాలని విప్ యార్లగడ్డ డిమాండ్**



మచిలీపట్నం, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ నిర్వహించిన 43వ నీటి పారుదల సలహా మండలి (ఐఏబి) సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు కీలక సూచనలు చేశారు. ఏలూరు కాలువ డిజైన్ డిశ్చార్జి 1,650 క్యూసెక్కులు ఉన్నప్పటికీ ప్రస్తుతం 800 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రామవరప్పాడు నుంచి పెరికీడు వరకు ఉన్న రైతులకు తూములు, రెగ్యులేటర్ల ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు కాలువకు నిరంతరంగా 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖ అధికారులను కోరారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంఘాల అధ్యక్షులు సమన్వయంతో వ్యవహరించి, ప్రతి కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బుడమేరు వరదల నుంచి ఏలూరు కాలువను రక్షించేందుకు ఎనికేపాడు అండర్ టన్నెల్ సామర్థ్యాన్ని 5,000 క్యూసెక్కుల నుంచి 25,000 క్యూసెక్కులకు పెంచే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, రూ.36 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్,తుమ్మల జగదీష్, కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ జలవనరులు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనసభను అడ్డుకోవడానికి కాదు.. ప్రమాదాలు నివారించడానికే తనిఖీలు చేపట్టాం

**చింతూరు ఎ ఎస్పీ బొడ్డు హేమంత్**



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:చింతూరు ఐటిడిఎ ముందు ఆదివాసీలు ధర్నా ఘటన పై చింతూరు ఎ ఎస్పీ బొడ్డు హేమంత్ మాట్లాడుతూ, రంపచోడవరం మహాసభకు వెళ్తున్న వారిని ఉద్దేశించి తనిఖీలు చేయలేదని స్పష్టం చేశారు. ఇది సాధారణంగా నిర్వహించే రోడ్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో భాగమేనని తెలిపారు.ఈ సందర్భంగా సుమారు 10 కమర్షియల్ గూడ్స్ వాహనాలను తనిఖీ చేశామని, వాటిలో కొన్ని వాహనాల్లో 20 నుంచి 50 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు గుర్తించి నిలిపివేసినట్లు చెప్పారు. ఘాట్ రోడ్లలో ఇలాంటి ప్రయాణాలు చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు.గతంలో కూడా కాకినాడ నుంచి భద్రాచలం వెళ్తున్న బొలెరో పికప్‌లో 26 మంది ప్రయాణిస్తుండగా ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేస్తూ, అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టామని వివరించారు.ప్రజలు సభలకు, సమావేశాలకు వెళ్లడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే గూడ్స్ వాహనాల్లో ప్రయాణించవద్దని, ప్రయాణికుల వాహనాల్లో కూడా సామర్థ్యానికి మించి ఎక్కవద్దని ఆయన సూచించారు.ప్రజల ప్రాణ భద్రతే మా మొదటి ప్రాధాన్యం, నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించండి ఆయన తెలిపారు.

# ప్రజాస్వామ్య హక్కులపై ప్రభుత్వ, పోలీసుల ఉక్కుపాదం దుర్మార్గం

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆగ్రహం**




చింతూరు డివిజన్ నేటి శుభోదయ:ప్రజా సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడే హక్కును భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిందని, అయితే ఆదివాసీలు తమ హక్కుల రక్షణ కోసం రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన "ఆదివాసీ గర్జన"ను ప్రభుత్వం కుట్రపూరితంగా పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి అడ్డుకోవాలని చూడటం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ప్రభుత్వ ఈ నిరంకుశ పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసి సంక్షేమ పరిషత్ (ఇూ్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పత్రికా పరంగా ప్రకటించారు. ప్రభుత్వం, పోలీసులు సృష్టించిన అరాచక నిర్బంధాలను, అడ్డంకులను బద్దలు కొట్టుకుంటూనే ఆదివాసీ గర్జన కార్యక్రమం అత్యంత విజయవంతం అయిందని ఆయన స్పష్టం చేశారు. శాంతియుత నిరసనలపై పోలీసులతో ఉక్కుపాదం మోపించడం పాలకుల చేతకానితనానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా కుంజా శ్రీను మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఖ) ప్రకారం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను, అధికరణ 19(1)(ఎ) ప్రకారం ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే ప్రాథమిక హక్కులను కాలరాయడానికి ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదని హెచ్చరించారు. ప్రజా ఉద్యమాలు ఏ రూపంలో వస్తాయో ఎవరూ ఊహించలేరని, ఇది నివురుగప్పిన నిప్పు లాంటిదని, దీన్ని బలవంతంగా అణచివేయాలని చూస్తే ఒక చోట జరిగే ఉద్యమం వంద చోట్ల దావానలంలా ఎగిసిపడుతుందని అయన హెచ్చరించారు.

# మోడల్ ఐటీఐల కోసం ఏపీ కి 25.88 కోట్లు

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కేంద్ర మంత్రి సమాధానం--- ప్రభుత్వ ఐటిఐల ఉన్నతీకరణ కోసం ప్రత్యేక పథకాలు--- కొత్త కోర్సులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ - ఏపీలో 15 ఐటిఐలకు కేంద్ర నిధులు-- దేశవ్యాప్తంగా పెరిగిన శిక్షణార్థుల సంఖ్య**



డిల్లీ, ఏలూరు, నేటి శుభోదయ ::: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఐటీఐ సంస్థలను కొత్త నైపుణ్యాలతో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సోమవారం లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ ఐటీఐలను మోడల్ ఐటీఐలుగా ఉన్నతీకరించే స్ట్రైవ్ పథకం కింద, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 15 ఐటీఐల ఉన్నతీకరణ కోసం ఇప్పటి వరకూ మొత్తం రూ. 25.88 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. పాఠ్యప్రణాళికల ఉన్నతీకరణ ప్రక్రియలో భాగంగా గత ఐదు సంవత్సరాలలో, క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద, గ్రీన్ హైడ్రోజన్ ప్రొడక్షన్ టెక్నీషియన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నీషియన్ సహా 32 నూతన కోర్సులను ఐటిఐ లలో ప్రవేశపెట్టారని చెప్పిన కేంద్ర మంత్రి, దేశవ్యాప్తంగా ఉన్న ఐటిఐ లలో నూతన కోర్సులలో శిక్షణార్థుల నమోదు 2022-23 విద్యా సంవత్సరంలో 8,611 ఉండగా, 2025-26 విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్య 42,338 కి పెరిగినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఐటిఐ లను మోడల్ ఐటిఐ లుగా ఉన్నతీకరించడం కోసం తీసుకువచ్చిన వివిధ పథకాల్లో భాగంగా విశాఖపట్నం లోని గాజువాక ప్రభుత్వ ఐటిఐ కి 2021-24 మధ్య ప్రత్యేకంగా 6 కోట్ల నిధులు అందించినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఇచ్చిన సమాధానంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి తెలియ చేశారు.

## 'సొసైటీ సీఈఓల కృషితో పాథమిక సహకార సంఘాలను మరింత బలోపేతం చేస్తాం

**- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలి**

**- అసంపూర్తి గోదాముల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి..**

**- రైతులకు సకాలంలో ఎరువుల పంపిణీ, ధాన్యం కొనుగోళ్లు సాగాలి..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);కూటమి ప్రభుత్వంలో ప్రాథమిక సహకార సంఘాల ( పి.ఏ.సి.ఎస్.) పనితీరు మెరుగుపడాలని, ఇందుకోసం సొసైటీల సీఈఓలు నిరంతరం కృషి చేయాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. రాజానగరం నియోజకవర్గంలోని పీ.ఏ.సి.ఎస్. ముఖ్య కార్యనిర్వహణ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి, రాజమహేంద్రవరం డివిజనల్ సహకార అధికారి పాల్గొని సంఘాల పనితీరును సమీక్షించారు. సొసైటీల పరిధిలోని సభ్యులకు మంజూరు చేసిన వివిధ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మొండి బకాయిలను తగ్గించడానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొన్నప్పుడే డిపాజిట్ల సేకరణ మరియు వ్యాపార విస్తరణ ప్రణాళికలు విజయవంతమవుతాయని ఎమ్మెల్యే బలరామకృష్ణ స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వారా చేపట్టే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరగాలని, ఎక్కడా రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని, స్టాక్ లభ్యతలో ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముగ్గళ్ళ, మునికూడలి, రఘుదేవపురం, సీతానగరం, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి సొసైటీల పరిధిలోని లంక భూముల్లో సేద్యం చేస్తున్న రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎరువుల కోసం ప్రతిపాదనలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే నల్లగొండ, ములగాడ రైతులకు సౌకర్యంగా ఉండేలా ఎరువుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాజానగరం, కాపవరం తదితర ప్రాంతాలలో గోదాముల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, వాటిని త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. సహకార సంఘాల సభ్యులు బకాయిల చెల్లింపుల్లో ఎదుర్కొంటున్న రివ్యూ ఛార్జీలు, షేర్ క్యాపిటల్ సమస్యలు, మరియు విక్రయాల కమీషన్ వంటి కీలక అంశాలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భావపురి సర్వీస్ స్టేషన్ ( బి.పి.సిఎల్ పెట్రోల్ బంక్)ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార ఉపౌర సంబంధాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వర్యులు గౌరవనీయులు కొలుసు పార్థసారథి ప్రారంభించారు.



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) జులై 20 :వేద మంత్రోచ్చారణల మధ్య వి.వినోద్ కుమార్ గౌరవ బాపట్ల జిల్లా కలెక్టర్ ఉ మేజిస్ట్రేట్ మరియు ప్రత్యేకాధికారి బాపట్ల పురపాలక సంఘ వారి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భావపురి సర్వీస్ స్టేషన్ (పెట్రోల్ బంక్)మరియు బంక్ కార్యాలయును మంత్రి వర్యులు బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ గారితో కలిసి ప్రారంభించారు. బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందించడంతో పాటు పురపాలక సంఘానికి స్థిరమైన ఆదాయ వనరును సమకూర్చడమే లక్ష్యమని మంత్రివర్యులు పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు పురపాలక సంఘానికి ఆదాయ వనరులు కూడా గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. అనంతరం పెట్రోల్ బంక్ నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్తమ సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఏ.హరికుమార్ ,కమిషనర్ యం.హాసిని ,తహశీల్దార్ శ్రీమతి షేక్ సలీమా ,బీపీసీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు,పురపాలక సంఘ సిబ్బంది ,అధికారులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఆస్పత్రికి వెళ్లొచ్చేలోపే ఇంటో దొంగతనం

**ఇద్దరు మైనర్ల అరెస్ట్, లక్షల విలువైన బంగారం స్వాధీనం!**



నేటి శుభోదయ జులై :21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ?విశాఖపట్నంలో ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకుని చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లను ఎంవీపీ క్రైమ్ పోలీసులు చాకచక్యం గా అదుపులోకి తీసు కున్నారు వారి వద్ద నుంచి రూ. లక్షల విలువైన 89.7 గ్రాముల బంగారు ఆభరణా లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### సంఘటన వివరాలు

తాళం వేసి ఆస్పత్రికి: కొత్త వెంకోజిపాలేనికి చెందిన బొజ్జెట్ రామచంద్రరావు తన మామ వైద్యం నిమిత్తం జులై 13న ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు.

### బీరువా పగులగొట్టి చోరీ

అదే రోజు రాత్రి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన ద్వారంతో పాటు బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి బీరువాలోని బంగారు,వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, జులై 16న ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### పోలీసుల దర్యాప్తు -- నిందితుల అరెస్ట్

బాధితుని ఫిర్యాదు మేరకు (క్రైమ్ నెంబర్ . 186/2026 యూ /ఎస్ 331(3), 305(ఎస్ ) బి న్ ఎస్ ) కేసు నమోదు చేసిన ఎస్.ఐ ఎస్ . రాజా దర్యాప్తు ప్రారంభించారు ?డీసీపీ, ఏసీపీ, సీఐల పర్యవేక్షణలో వెంకోజిపాలెం ప్రాంతంలోని సీసీటీవీ (సీసీటీవీ ) ఫుటేజ్, కమాండ్ కంట్రోల్ దృశ్యాల ను విశ్లేషించారు ?ఈ క్రమంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-11 వద్ద అనుమానా స్పదంగా ఉన్న ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీ కరించారు.

### స్వాధీనం చేసుకున్న సొత్తు..

పోలీసులు నిందితుల నుంచి మొత్తం 89.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో

3 బంగారు గొలుసులు: (24 గ్రా, 4 గ్రా, 18 గ్రా)

5 బంగారు ఉంగరాలు: (3 గ్రా, 3 గ్రా, 5 గ్రా, 5 గ్రా, 2.7 గ్రా) 1 బంగారు బ్రాస్‌లెట్: (24 గ్రా)

నిందితులైన ఇద్దరు మైనర్లను పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు.

# "లాభసాటి వ్యవసాయానికి భూసార పరీక్షలు అవసరం ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం, తాడేపల్లిగూడెం ఏడిఏ రంగారావు"




పెంటపాడు జులై 20 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)::: తాడేపల్లిగూడెం భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ ఎ వి రంగారావు, పెంటపాడు మండలం, పెంటపాడు హై స్కూల్ విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన నేలలో లాభసాటి వ్యవసాయానికి భూసార పరీక్షలు అవసరమని సహాయ వ్యవసాయ సంచాలకులు, రంగారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థూల సూక్ష్మ పోషకాల లభ్యత, భూసార పరీక్షలకు మట్టి నమూనా సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి రైతులు తమ పొలంలోని మట్టిని ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలని, పోషక పదార్థాల గురించే కాక భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని మరియు నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా మట్టి పరీక్ష చేయించుకోవాలని తెలియజేశారు. నేలలు వాటిలో సహజంగా ఉన్న పోషక పదార్థాలతో పాటు, అదనంగా వేసిన సేంద్రీయ మరియు రసాయనిక ఎరువుల్లోని పోషకాలను మొక్కలకు అందజేసి పంట దిగుబడికి దోహదపడతాయి కాబట్టి నేలల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ద్వారా సమగ్ర ఎరువుల వినియోగం చేపట్టి సాగు వ్యయాన్ని నియంత్రించుకోవడంలో పాటు భూసార పరిరక్షణ చేయడంతోపాటు అధిక మరియు సుస్థిర దిగుబడులను పొందవచ్చని తెలియజేశారు. రసాయన ఎరువులను ఎక్కువగా వాడటం వలన మొక్కల శాఖీయ భాగాలు బాగా ఎదిగి, అధిక దిగుబడులకు ఆస్కారం ఉన్నప్పటికి రకాల చీడపీడల తాకిడి ఎక్కువై పంట పెట్టుబడి పెరుగుతుందని, అంతే కాకుండా అధిక రసాయన ఎరువులు వేయడం వలన నేలలు ఆమ్ల గుణం లేదా క్షార గుణం కలిగిన నేలలుగా మారి, మొక్కలకు పోషకాలను అందించలేని స్థితికి చేరుతాయని తెలియజేశారు. ఈ సందర్భంలో తక్కువ ఖర్చుతో అన్ని పోషకాలను మొక్కకు అందించి ప్రామాణిక దిగుబడి పొందడానికి గాను సేంద్రీయ, జీవన ఎరువులను విస్తృతంగా వినియోగించవలసిన అవసరం ఎంతో ఉందని తద్వారా నాణ్యమైన ఆరోగ్యకరం అయిన పంటను ఉత్పత్తి చేయవచ్చునని, ఈ ఎరువులు తక్కువ ధరకు లభ్యమవడంతో పాటు నేలలో సేంద్రీయ కార్బన్ పెరగడానికి దోహదపడి, భూభౌతిక లక్షణాలను మెరుగుపరుస్తాయని వివరించారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని భూసార పరీక్ష కేంద్రం , తాడేపల్లిగూడెం వారు పీఎం-శ్రీ పథకం క్రింద విద్యార్థులలో వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన పెంపొందించడానికి స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం క్రింద పలు శిక్షణ, అవగాహన కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు పెంటపాడు హైస్కూల్ లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఏవో చీరల రవికుమార్, జిల్లా వనరుల కేంద్రం, భీమవరం వ్యవసాయ అధికారులు, శ్రీమతి జి. బాల నాగేశ్వరి, ఎస్. గీతా దేవి మరియు కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి శాస్త్రవేత్త పి. వినయ లక్ష్మి విద్యార్థులకు భూసార పరీక్ష ఆవశ్యకత మరియు మట్టి నమూనా తీయడంలో మెళకువలను వివరించి, ప్రయోగాత్మకంగా చూపించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, పంట దిగుబడి పెంపు వంటి అంశాలపై సమగ్రంగా విద్యార్థులకు వివరించారు. ఈ మట్టి నమూనాలను సేకరించిన తర్వాత వాటిని భూసార పరీక్షా కేంద్రానికి పంపించి, అక్కడ ఆరు రకాల ముఖ్యమైన పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ముఖ్యమైన పరీక్షలు: 1. నేల స్వభావం 2. ఉదజని సూచిక 3. లవణాల సాంద్రత 4. సేంద్రీయ కార్బన్ 5. లభ్య భాస్వరం 6. లభ్య పొటాష్. ఈ ఆరు పరీక్షల వివరాలను ఒక నివేదికలో పొందుపరిచి, రైతు వేయదలచిన పంటకు పరీక్షా ఫలితాల ఆధారంగా సూచనలు అందిస్తారు. ఈ నివేదికను సాయిల్ హెల్త్ కార్డ్ అంటారు. ఇది రైతులకు ఎరువుల వినియోగంలో మరియు సమగ్ర పోషకాల యాజమాన్యాన్ని అనుసరించడంలో ఎంతో తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, డి. పద్మజ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు పీవీ.నరసింహారావు, ఫి వెంకట రమణయ్య, బి. సాయి శ్రీ మరియు హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాయలసీమ రైతాంగానికి మేలు చేసింది సీఎం చంద్రబాబే

**రాయలసీమ ద్రోహి జగన్ రెడ్డి.**

**ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమ రైతాంగానికి మీరు ఏమి చేశారో చెప్పండి. హంద్రీనీవాపై చేసిన వైసిపి నేతల ఆరోపణలు శుద్ధ అబద్దాలే వైసీపీకి రాయలసీమ అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు లేదు హంద్రీ--నీవా ప్రాజెక్టు పనుల్లో ఎక్కడ అవినీతి జరిగిందో నిరూపించండి. ఎవరి హయంలో రాయలసీమ అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధం అని సవాల్ విసిరిన సత్యసాయి జిల్లా టిడిపి ప్రజా ప్రతినిధులు.వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టిన టీడీపీ ప్రజా ప్రతినిధులు రాష్ట్ర మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే, జ ఎంఎస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె , పరిటాల శ్రీరామ్**



అనంత పురం జూలై 20 నేటి శుభోదయ: రాయలసీమ రైతాంగానికి అసలైన ద్రోహం చేసింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,ధర్మవరం నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ లు విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమకు ఒక్క చుక్క అదనపు సాగునీరు తీసుకురాలేదని, ఒక్క కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నేతలకు లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చెందిన వైసిపి నేతలు హంద్రీనీవా ప్రాజెక్టు పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసిపి నేతలపై సత్యసాయి జిల్లా టిడిపి ప్రజా ప్రతినిధులు రాష్ట్ర మంత్రి సవితమ్మ ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి ,ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ లు మండిపడ్డారు. వైసీపీ చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాయలసీమ కు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చేసిన అభివృద్ధి పనులు, కృష్ణా జలాల ద్వారా చెరువులను నింపిన ఘనత మాదే అని సోమవారం పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం చెరువు వద్ద నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014--2019 మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ. 12 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి, హంద్రీ--నీవా సహా పలు ప్రాజెక్టులకు వేగం తీసుకొచ్చిందని తెలిపారు. దీనికి భిన్నంగా, జగన్ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై కేవలం రూ. 2 వేల కోట్ల మేర మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో హంద్రీ--నీవా ప్రాజెక్టు అభివృద్ధికి కొత్త ఊపిరి పోసిందని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలోనే హంద్రీ--నీవా ప్రాజెక్టు లైనింగ్, ఆధునీకరణ, అభివృద్ధి పనుల కోసం రూ. 3,890 కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద చెరువైన బుక్కపట్నం చెరువును సందర్శించిన టీడీపీ ప్రజాప్రతినిధులు, కృష్ణా జలాలతో కళకళలాడుతున్న చెరువును పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ హంద్రీ--నీవా ద్వారా కృష్ణా జలాలు చేరడంతో చెరువు పూర్తిగా నీటితో నిండిందని తెలిపారు. చెరువులో బోటింగ్ చేస్తూ పుష్కలంగా నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకుండా వాస్తవాలను గుర్తించాలని సూచించారు. రాయలసీమ రైతాంగ సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వ్యవసాయాభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం ,కొత్త చెరువు,పుట్టపర్తి మండలాలకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న సీజ్ చేసిన వాహనాల వేలం



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్ )జూలై 20:వివిధ కారణాల చేత రవాణా శాఖచే సీజ్ చేయబడి, పోలీస్ స్టేషన్లు మరియు ఆర్టీసీ డిపోలలో ఉంచబడిన 10 వాహనాలను 2026 ఆగస్టు 1న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు బాపట్ల జిల్లా రవాణా అధికారి పరంధామ రెడ్డి తెలిపారు. వేలానికి ఉంచిన వాహనాల్లో 4- ఆటోలు, 3- మాక్సీ క్యాబ్లు, 3- తేలికపాటి మరియు భారీ సరకు రవాణా వాహనాలు ఉన్నాయి. వేలంలో పాల్గొనదలిచిన అభ్యర్థులు జూలై 30 ఉదయం 10.30 గంటల నుండి జిల్లా రవాణా అధికారి, బాపట్ల కార్యాలయంలో రూ. 100 నమోదు రుసుము చెల్లించి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. వేలానికి సంబంధించిన వాహనాల వివరాలు జిల్లా రవాణా అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉంటాయి. వేలంలో పాల్గొనే అభ్యర్థులు తాము కొనుగోలు చేయదలిచిన వాహనాలను ముందుగానే పరిశీలించి, చెల్లించదలిచిన ధర, నిర్ణయించిన కనీస ధర కన్నా అధికముగా కోట్ చేసి సీల్డ్ కవర్లో దరఖాస్తును సమర్పించాలి. దరఖాస్తుతో పాటు చిరునామా ధృవీకరణ పత్రం ప్రతిని జతచేసి, ఆగస్టు 1 మధ్యాహ్నం 2.00 గంటలలోపు జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ లో వెయ్యవలెను. అనంతరం మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ కవర్లను తెరిచి, అత్యధిక ధర కోట్ చేసిన అభ్యర్థికి సంబంధిత వాహనాన్ని కేటాయించడం జరుగుతుంది. షరతులు వర్తిస్తాయి.

## ఓటు ఎంతో విలువైనది : బిఆర్ ఎస్ నాయకులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు ఎంతో విలువైనది అని బిఆర్ ఎస్ జిల్లా నాయకులు జోగుపర్తి ప్రభాకర్ రావు తెలిపారు. ఖమ్మంజిల్లా అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశానుసారం నాలుగవ డివిజన్ 62 బూతులో సర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాలుగవ డివిజన్ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు జోగుపర్తి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు సమక్షంలో, నాయకులు కంచర్ల దయాకర్ పాల్గొన్నారు. ఓటరు రిజిస్ట్రేషన్ చేసిన వారి పేర్లు(1) మంద ప్రసాద్ (2) మంద దుర్గా (3) ముందా ధనుష్ (4) మంద శంకర్(5) మంద సౌజన్య(6) మంద మౌనిక. వీరి ఓటును ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.

## జీవో 396ను, పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి: బాపట్లలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరుల ఆందోళన.



బాపట్ల నేటి శుభోదయ జులై 20 :బాపట్ల దస్తావేజు లేకరుల సంఘం ఆధ్వర్యంలో పెన్ డౌన్ కార్యక్రమాన్ని 20వ తారీకు నుండి 31 వ తారీఖు వరకు నిరవధిక సమ్మెను చేపడుతున్నట్లు సంఘ అధ్యక్షులు కారుమూరి నారాయణరావు (బుజ్జి) తెలియజేశారుప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో నెంబర్ 396ను, పీపీపీ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు, డీటీపీ ఆపరేటర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బాపట్ల డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో అసోసియేషన్ సభ్యులు బి.రాజు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఎలాంటి ఆధారపడకుండా సొంతంగా జీవనోపాధి సాగిస్తున్న తమ బతుకులను రోడ్డున పడేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీలు, బీటెక్ లాంటి ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో, గత 20 ఏళ్లుగా దస్తావేజులు రాస్తూ గౌరవంగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. కక్షిదారులకు, తమకు మధ్య ఉన్న నమ్మకంతో నడిచే ఈ వ్యక్తిగత వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.కార్పొరేట్ సంస్థలకు లొంగిపోయి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు అన్యాయానికి గురవుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడుతూ, ఫ్రంట్ ఆఫీసులు ఏర్పాటు చేసి దస్తావేజులను ప్రభుత్వమే తయారు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జీవో కారణంగా దస్తావేజు లేఖరులే కాకుండా వారిని నమ్ముకున్న స్టాంప్ వెండర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అనుబంధ కార్మికులు పూర్తిగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కారుమూరి నారాయణరావు(బుజ్జి), వైస్ ప్రెసిడెంట్ నంగనం నరసింహారావు, సెక్రెటరీ టి. కొండలరావు, తుళ్లూరి సంతోష్ గుప్తా, ట్రెజరర్ విగ్రహాల సాయి శ్రీనివాస్ అసోసియేషన్ సభ్యులు, దస్తావేజు లేఖరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జీవో 396, పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## కోరుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా టి.వి.చలపతి రావు ఆకస్మిక తనిఖీలు..!!

**- ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశాలు..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) ; తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంను డిప్యూటీ జిల్లా వైద్య -ఆరోగ్య శాఖాధికారి - డా టి.వి.చలపతి రావు -రాజమండ్రి ఆకస్మికశీ తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు తనిఖీ చేసారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో ప్రభుత్వం అందించు సేవలు ప్రజలు కు ఏవిధముగా అందుతున్నాయో పరిశీలించారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రం కి వచ్చిన మందులు, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు, కుక్క కాటు, పాము కాటు మందులు,డెలివరీ లు, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు ... అన్ని విభాగం లు పరిశీలించి పలు సూచనలు చేసినారు. సిబ్బంది అందరు కలిసి కట్టుగా పని జేసి ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ లో ప్రవేశపెట్టిన ప్రతీ పథకము 100% లక్ష్యం లు పూర్తి చేసి మంచి పేరు తీసుకొని రావాలని ఆదేశించారు. పై ఆకస్మిక తనిఖీ లో డైప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం - రాజమండ్రి సిబ్బంది ఎం.పి.హెచ్.ఇ. ఓ. నాగు, ఎం.కె.వి. సుబ్రహ్మణ్యం మరియు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం -కోరుకొండ సిబ్బంది సి.హెచ్.ఓ. సత్యనారాయణమ్మ, ఇతర అధికారులు లక్ష్మి, యెజ్జు ఉమా పార్వతీశం, లక్ష్మి కాంతం, స్టాఫ్ నర్స్ జాన్సీ, ఆనందరావు, స్వామి నాయుడు, అన్నపూర్ణ, నవీన్, జాన్సీ, ఫార్మసీ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజా రాజధానా కార్పొరేట్ రాజధానా - ఆంధ్రప్రదేశ్‌ని అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారు

**- రాష్ట్రంలో పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**- ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తారని, ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం**

**- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**




( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) రాష్ట్రంలో ప్రజా సమస్యలు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ ఆరోపించారు. సోమవారం ఉదయం విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాల్లో కలిసిపోయాయన్నారు. యువత, రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిచో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. "నిరుద్యోగ సమస్య, ధరల పెరుగుదల, రైతు సమస్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం వీటిని పట్టించుకోవడం లేదు" అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అమరావతి అంశంలో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. "చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు 29 గ్రామాల ప్రజలు రాజధాని కోసం 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారిన తరువాత ఆ రైతులు నరకయాతన అనుభవించారు" అని అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ల్యాండ్ పూలింగ్ పేరుతో మరో 20 వేల ఎకరాలు అడుగుతోందని, ఇంతకు ముందు భూములు ఇచ్చిన రైతులకే ఇంకా న్యాయం జరగలేదని విమర్శించారు. "అమరావతిలో ఎయిర్‌పోర్ట్ కడతామని మాయమాటలు చెబుతున్నారు. గతంలో భూములు ఇచ్చిన వారికే ఏమీ లేనప్పుడు కొత్త కథలు ఎందుకు" అని ప్రశ్నించారు. దౌర్జన్యంగా భూములు లాక్కుంటున్నారని, రేపు ఈ ప్రభుత్వం రాకపోతే భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఒక పక్క ప్రజా రాజధాని అంటూనే దానిని కార్పొరేట్ రాజధానిగా మార్చారని ఆరోపించారు.ప్రభుత్వంపై ఇతర ఆరోపణలు:భూముల కేటాయింపు: విశాఖలో కారు చౌకగా భూములు ఇస్తున్నారు. అమరావతిలోనూ తమకు కావాల్సిన వారికి చౌకగా భూములు కట్టబెడుతున్నారు. ఆర్థిక పరిస్థితి: గతంలో ఈ రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తామన్న టీడీపీ నాయకులు, నేడు దీనిని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు.లోకేష్ పర్యటనలు: మంత్రి లోకేష్ విదేశీ పర్యటనల పేరుతో పెట్టుబడులు తెస్తామనడం హాస్యాస్పదం. తన మానవ వనరులు, ఐటీ శాఖల్లోనే పట్టు సాధించలేని వ్యక్తి ఇతర మంత్రుల శాఖలపై దృష్టి పెడుతున్నారన్నారు.విద్యాశాఖ: తమిళనాడులో విజయ్ విద్యా శాఖలో సంస్కరణలు తెస్తుంటే, ఇక్కడ మాత్రం కార్పొరేట్ సంస్థలకే విద్యాశాఖ మంత్రి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. మాదిగాని గురునాథం: గత ప్రభుత్వంలో మూడు రాజధానుల ఉద్యమం చేసిన మాదిగాని గురునాథం ఇప్పుడు టీడీపీలో చేరి మౌనంగా ఉన్నారన్నారు. చేతనైతే ముందు 52 వేల మందికి పట్టాలు ఇప్పించాలని సవాల్ విసిరారు.ఎన్టీఆర్: ఎన్టీఆర్ రా ఆర్గనైజేషన్ తిరుపతిలో 100 కోట్లతో సేవా కార్యక్రమాలు చేస్తామనడం మంచి పరిణామం. తప్పకుండా ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తారని, ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు.

## సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు



**కృష్ణారావు జయంతి ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ పట్ల హర్షం**

అవనిగడ్డ, జులై 20(అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకలు ప్రతి ఏటా ఆగస్టు 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం కృష్ణారావు శత జయంతి ప్రారంభిస్తూ అధికార భాషా సంఘానికి వారి పేరు పెట్టారని తెలిపారు. తెలుగు భాషకు సేవ చేసిన వారిని జాతి గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి ఈ నిర్ణయాల ద్వారా తెలియచెప్పారన్నారు.

## అనకాపల్లి జిల్లా అభివృద్ధి అంశాలపై మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు..!!

**- మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యలు:**

**పవిత్రమైన పంచదారల కొండ ప్రాంతాన్ని "నో మైనింగ్ జోన్"గా ప్రకటిస్తామని తెలిపారు. పంచదారల కొండ ప్రాంతంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.**



( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఈ అంశంపై అనకాపల్లి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి కీలక నిర్ణయం తీసుకున్నామని, ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు.ప్రతి అంశాన్ని రాజకీయంగా మలచడం వైసీపీకి అలవాటైందని విమర్శించారు.ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ వ్యాఖ్యలు: పంచదారల కొండను వైసీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు హయాంలోనే దోపిడీ చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచదారల కొండ మరియు కొండకర్ల ఆవ ప్రాంతాలను "నో మైనింగ్ జోన్"గా ప్రకటించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. పంచదారల కొండ అంశంపై వైసీపీ నాయకులు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను ప్రజలు మరిచిపోలేదని అన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి కోలాహలంగా తరలి వస్తున్న భక్తులు.

ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భక్తుల రద్దీ



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-ఆషాఢ సారె ఆరవ రోజు సోమవారం శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళ భక్తులతో రద్దీ తీవ్రంగా నెలకొంది.సాయంత్రం 5 గంటల వరకు 18 సారె బృందాలు రాగా, 7,843 మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు.భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ (100/- దర్శనం లైన్ ) సారె భక్తులకు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వికె. శీనానాయక్, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్మాతను దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు

**శ్రీనివాసనంద సరస్వతి**



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ జగన్మాతను ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి సోమవారం శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనానికి విచ్చేసారు. ఈ సందర్భంగా శంకర శాండిల్య ఆలయ ఉప ప్రధానార్చకులు దర్శన ఏర్పాట్లు చేసారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## ప్రతి ఫిర్యాదుకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలి




విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు వినిపించే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు వారి సమస్య పరిష్కారం వివరించడమే కాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 20 అర్జీలు స్వీకరించారు. వాటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించినవి 8, ఇంజనీరింగ్ శాఖకు 2, పబ్లిక్ హెల్త్‌కు 2, రెవెన్యూ శాఖకు 3, యూసీడీ విభాగానికి 2, హౌసింగ్‌కు సంబంధించినవి 2, ఇతర శాఖకు సంబంధించినది 1 ఫిర్యాదును అందుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, కె. శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు.

**పార్లమెంట్‌లో ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సమాధానం**




విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-పార్లమెంట్ లో ఆంధ్రప్రదేశ్ లో జాతీయ అప్రెంటీస్ ప్రమోషన్ పథకం (ఎన్ఏపీఎస్2.0) ద్వారా ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్త ఆశలు వచ్చాయని నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో దాదాపుగా వేల మందికి యువతీ యువకులకు వివిధ రంగాల్లో అప్రెంటీసులుగా చేరి క్షేత్రస్థాయిలో శిక్షణ, నైపుణ్య అభివృద్ధిని మొదలు పెట్టడం వల్ల ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని వారికీ స్టైఫండ్ కూడా జమ చేసినట్లు కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి వెల్లడించారు. లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆంధ్రప్రదేశ్లో జాతీయ అప్రెంటిస్ ప్రోత్సాహక పథకం (ఎన్ఏపీఎస్)2.0 ద్వారా ఎంతమందికి అప్రెంటిస్ షిప్ ల ట్రైనింగ్ పరిశ్రమల ద్వారా పొందిన అవకాశాలు లబ్ధి పొందిన వారి సంఖ్య స్టైఫండ్ వంటి వివిధ అంశాలపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా ఆ శాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారుఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువతకు కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ పథకం (ఎన్ఏపీఎస్ 2.0) కొత్త ఆశలు చిగురింప చేసేలా చేస్తుంది . రాష్ట్రంలో ఈ పథకం గడచిన నాలుగు సంవత్సరాలలో దాదాపుగా 93 094 మంది యువతీ యువకులకు అప్రెంటిస్ షిప్ పూర్తిచేసి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తూ వారి నైపుణ్యాలకు పదును పెట్టి యువతి యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేసింది కేవలం అప్రెంటిస్ షిప్ సంఖ్య పెరగడమే కాకుండా రాష్ట్రంలో వారికి శిక్షణ ఇచ్చేందుకు1135 ప్రత్యేక పరిశ్రమలు ముందుకు వచ్చాయని తెలియజేశారు పైగా ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం అందించే స్టైఫండ్ మద్దతును డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ( డి బి టి ) ద్వారా నేరుగా అప్రెంటిస్ షిప్ తీసుకునే వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుండడం వల్ల ఈ పథకానికి ఆదరణ మరియు పారదర్శకత పెరిగింది ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మద్దతు కూడా గణనీయంగా పెరుగుతుంది 2021- 22లో 4.43 కోట్లుగా ఉన్న నిధులు 2024-25 నాటికి ఏకంగా 19.65 కోట్ల కు కేంద్రం చేర్చింది ఈ చేరిక ద్వారానే కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో చాలా సుస్పష్టంగా అర్థమవుతుంది అయితే కేవలం నిధులు కేటాయింపు గణాంకాల పెరుగుదలతో సరిపెట్టుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలియజేశారు ప్రతి జిల్లాలో ఏ ఏ రంగాలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక పరిశ్రమలతో విద్యార్థులను అనుసంధానం చేయాలని తెలిపారు పరిశ్రమల అవసరాలకు విద్యాసంస్థల బోధనకు మధ్య ఉన్న దూరం పూడ్చినప్పుడే ఈ నైపుణ్య యజ్ఞం పూర్తవుతుందని తెలియజేశారు నవ్యాంధ్ర ప్రగతి పథంలో యువతను భాగస్వామ్యం చేస్తూ వారి శ్రమ శక్తికి సరైన గుర్తింపునిచ్చేలా ఈ పథకాన్ని మరింత విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉందని స్పష్టం చేశారు

## పభుత్వ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

**ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పనకు తమ ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు తీసుకొంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ చెప్పారు.సోమవారం ఉదయం తూర్పులోని 5వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్ లోని ఆయా విభాగాల అధికారులను గద్దె ఆదేశించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లోని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్, దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తో పాటుగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కూడా ప్రభుత్వ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా ఏమైనా సౌకర్యాలు అవసరమైతే తన దృష్టికి తీసుకువస్తే స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రామ్ లో భాగంగా వారికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ హాస్టల్లో డ్రైనేజీ సదుపాయం లేదని తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే కార్పొరేషన్ అధికారులకు చెప్పి డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇలా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందాలనే ఉద్దేశంతో తమ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. హాస్టల్లో సౌకర్యాలు కల్పనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రాకపోతే సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో తన సొంత నిధులను వెచ్చించి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తానని గద్దె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గద్దె రమేష్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,తాడి బాబురావు, నందిపాటి దేవానంద్, బచ్చులకూర అజయ్ కుమార్, దయాల శిరీష గాంధీ, గుత్తికొండ కృష్ణమోహన్, శివలక్ష్మి, గల్లా రవి, షేక్ అనీఫ్, ఏఎస్ దబ్ల్యూ గణేష్, ఏ.వనజ రమణి తదితరులు పాల్గొన్నారు.

## యూఏఈలో ఘనంగా బోనాలు

**- ఏమి రేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు**

**--- ముఖ్య అతిథిగా కొత్త జైపాల్ రెడ్డి**



కరీంనగర్, నేటి శుభోదయ ::: విదేశాలలో కూడా బోనాలు, బతుకమ్మ వంటి సంప్రదాయ పండుగలు ఘనంగా నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయడం అభినందనీయమని మైత్రి గ్రూప్స్ వ్యవస్థాపకుడు కొత్త జైపాల్ రెడ్డి అన్నారు.దుబాయ్ లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విదేశీ గడ్డపై తెలంగాణ ఆత్మను సజీవంగా నిలుపుతున్న ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు.యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్స్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దుబాయ్, అబుదాబి,షార్జాతో పాటు వివిధ ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాస భారతీయులు కుటుంబాల సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో వరుసగా నాలుగోసారి నిర్వహించిన ఈ వేడుకలో గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, కుంకుమార్చన, మహాహారతి, దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పట్టు చీరలు ధరించిన మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ నిర్వహించిన ఊరేగింపు, ఒగ్గు డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ సంస్కృతిని విదేశీ నేలపై ఆవిష్కరించాయి.ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్ రావు మాట్లాడుతూ, విదేశాల్లో జన్మించిన భావితరాలకు తెలంగాణ పండుగల గొప్పతనాన్ని పరిచయం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.అనంతరం భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేసి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విదేశాల్లో ఉన్నామనే భావన కలగకుండా స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతిని ఈ కార్యక్రమం కల్పించిందని తెలంగాణ ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎలిగేటి, ప్రధాన కార్యదర్శి రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శి శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు బీరెల్లి, మాజీ అధ్యక్షులు రాధారపు సత్యం, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఎస్.పీ. కస్తూరి, సురేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ ఆచారి, రఘు ఎలిగేటి, రాము కందుకూరి, సామ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ పోలంపల్లి, కిరణ్ చెట్టిగారి, సారిక పీచర, మమత కస్తూరి, అన్నపూర్ణ, మౌనిక గౌడ్, మధు కుమార్, వనజ గోగుల, రనీషా, విపుల, స్వప్న, దీపిక తదితరులు, మహిళా విభాగ సభ్యులు, వాలంటీర్లు మరియు యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎ.పి.ఎస్.ఆర్.ఎం.సి.హెచ్ హైస్కూల్ లోని విద్యార్థులకు
**కెరీర్ గైడెన్స్ , మోటివేషన్ క్లాసులు**



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-ఎ.పి.ఎస్.ఆర్.ఎం.సి.హెచ్ హైస్కూల్ లోని 9 వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాసులను ముమ్వా శైలజ నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ విద్యార్థులకు విద్య వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.విద్య జ్ఞానాన్ని ప్రజ్వలింపజేస్తుందని, మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుందని, మన లక్ష్యాలను నిర్దేశించి వాటిని సాధించడానికి మార్గనిర్దేశం చేస్తుందని తెలిపారు. అలాగే క్రమశిక్షణ కలిగి ఉండటం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ క్రమశిక్షణ అనేది మనం నిర్దేశించుకున్న లక్ష్యం వైపు చేరే నిరంతర, స్థిరమైన ప్రయత్నం అని, మనకు ఆత్మవిశ్వాసాన్ని, సామర్థ్యాన్ని అందించి మనల్ని శక్తివంతం చేస్తుందని శైలజ విద్యార్థులకు తెలిపారు.శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండటం వల్ల కలిగే ఉపయోగాల గురించి తెలియజేస్తూ శారీరక ఆరోగ్యం మన శారీరక సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని, మన ఓర్పును బలపరుస్తుందని, అదేవిధంగా, మన మానసిక ఆరోగ్యం మన నమ్మకాలను, విలువలను మరింత బలంగా సుసంపన్నం చేస్తుందని శైలజ తెలిపారు.

## నారా లోకేష్ పునాదిపాడు పర్యటనను విజయవంతం చేయాలి
**- ఎమ్మెల్యే బోడే ప్రసాద్**



పెనమలూరు, జులై 20 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈనెల 27న కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో జరగనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. సోమవారం పెనమలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే

బోడే ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని లోకేష్ ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈడుపుగల్లు సెంటర్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభం కానుందని,ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు,ఈ పర్యటనను విజయవంతం చేయడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వెలగపూడి శంకర్ బాబు, స్టేట్ డైరెక్టర్లు పితా గోపీచంద్, శొంఠి శివరామ ప్రసాద్, తాడిశెట్టి వీరస్వామి తాతపూడి గణేష్,బిజెపి నాయకులు ఏ కుల విజయేంద్ర,మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనందప్రసాద్,జంపన వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ కుటుంబరావు, జంపాన గురునాథం, దేవినేని రాజా,యార్లగడ్డ రాజా,అనంతనేని ఆజాద్, తుమ్మల రామ్ కుమార్ విగ్నేష్ చౌదరి, దండమూడి సాయి సుధా, మేడసాని రత్నకుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఓ.సిలను అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఎల్.ఓ.సి పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలు భారంగా మారకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా కుంటముక్కల గ్రామానికి చెందిన కె.సన్నీ కుమార్ కు 1,53,929, కూనపరాజు పర్వ గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావుకు 1,61,137, తుమ్మలపాలెం గ్రామానికి చెందిన సిహెచ్.గిరి ప్రసాద్ కు 2,05,116, నాగులూరు గ్రామానికి చెందిన ఎం.బాబు కు 2,55,867 విలువైన ఎల్.ఓ.సి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్హులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్.ఓ.సిలు అందుకున్న లబ్ధిదారులు తమకు వైద్య సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కుటుంబ సభ్యులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి చేయడం తీవ్ర ఆక్షేపణీయం
**ఎంపీ రవిచంద్ర**




ఖమ్మం, నేటి శుభోదయ ::: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థులు,యువతపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. "మార్చ్ టు పార్లమెంట్"అనే నినాదంతో వారు చేపట్టిన శాంతియుత ప్రదర్శనపై పోలీసులు పోలీసులు లాఠీలతో విచక్షణారహితంగా దాడికి దిగడం తీవ్ర ఆక్షేపణీయమని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుత పద్ధతుల్లో భావ వ్యక్తీకరణ చేసే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్న ప్రాథమిక సూత్రాన్ని పోలీసులు కాలరాస్తూ విద్యార్థులు,యువతపై లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అమానవీయమని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమన్నారు. ప్రదర్శన సందర్భంగా విద్యార్థులపై బనాయించిన కేసులను వెంటనే ఉపసంహరించాలని, గాయపడిన వారికి ఎయిమ్స్ లో మెరుగైన ఉచిత వైద్య సేవలందించాలని ఎంపీ వద్దిరాజు ఢిల్లీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# జీవీఆర్ నగర్ ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం
# వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని జీవీఆర్ నగర్ లో సోమవారం 1500 కె.ఎల్.ఇ.ఎల్.ఎస్.ఆర్ 4.కోట్ల 47 లక్షల రూపాయలు వ్యయంతో నూతన వాటర్ ట్యాంక్ ను ప్రభుత్వ విప్, సెంట్రల్ బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించి,స్థానికులకు మంచినీటి కొరతను తీర్చారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో గద్దె వెంకట్రావు నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయక్ నగర్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి నాంది పలికామని తెలిపారు. అనంతరం ప్రజలు స్థలాలు కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకోవడంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందిందన్నారు.సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు 150 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేశామని ఉమా చెప్పారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ట్యాంక్‌కు మంచినీటి కనెక్షన్లు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు.2024లో తిరిగి ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన వెంటనే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు, ఇంజినీర్లతో సమన్వయం చేస్తూ ఎన్నో అవాంతరాలను అధిగమించి వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ పూర్తి చేసి నేడు ప్రజలకు అంకితం చేశామని తెలిపారు, ఈ ప్రక్రియలో అధికారులు పగలు-రాత్రి శ్రమించారని, పోలీసు శాఖ కూడా సమన్వయంతో సహకరించిందని ఎమ్మెల్యే కొనియాడారు.జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయక్ నగర్, గుండుదల తదితర ప్రాంతాల ప్రతి ఇంటికీ మున్సిపల్ మంచినీటి కనెక్షన్లు అందించే కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను నమోదు చేసుకుని ప్రతి కుటుంబానికి మంచినీటి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు.అదేవిధంగా 85 కోట్ల వ్యయంతో సెంట్రల్ నియోజకవర్గానికి రా వాటర్ ఫిల్ట్రేషన్ ప్లాంట్‌ను మంజూరు చేయించామని, త్వరలోనే శంకుస్థాపన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కృష్ణా నది నుంచి నేరుగా ముడి నీటిని తీసుకొచ్చి శుద్ధి చేసి నియోజకవర్గంలోని అన్ని వాటర్ ట్యాంకులకు సరఫరా చేయడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.24 నెలల్లో సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి 550 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే మూడేళ్లలో సమస్యలులేని మోడల్ నియోజకవర్గంగా సెంట్రల్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.అధికారం మాకు అలంకారం కాదు, ప్రజలకు సేవ చేసే బాధ్యత, ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తర్వాత కనిపించకుండా పోవడం మా రాజకీయ విధానం కాదు, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడమే మా లక్ష్యం అని ఉమా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లక్కం రాజు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి భద్రం, ఇంచార్జ్ కర్ణం వెంకటరమణ, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు (వెంకీ ), ఈఈ గోపాల కృష్ణమూర్తి, చౌదరి సూర్యనారాయణ, రెడ్డి శంకర్, వాసు, చిన్నబాబు, తుంపాల వరప్రసాద్, మురళి, సత్తివాడ రాము, లక్కి శెట్టి సాయి, సంతోష్, సింహాచలం, కోటేశ్వరమ్మ, నాగమణి, అనురాధ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి గోదావరిలో అక్రమంగా ఇసుక త్రవ్వకాలకు వినియోగించిన 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్.!!

**- నూతన ఇసుక విధానం--2024 పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు చర్యలు..**

**- కాటవరం, వంగలపూడి ఇసుక తవ్వకాలు, నిల్వలపై చర్యలు ఎప్పుడు అంటున్న ప్రజలు..!**




రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలకు వినియోగించిన 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్ చేసారు. కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో సోమవారం నిర్వహించిన సంయుక్త తనిఖీలో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాలకు వినియోగిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం--2024 మరియు పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సమక్షంలో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు, వారి సాంకేతిక సిబ్బంది, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద సంయుక్త తనిఖీ నిర్వహించారు. తనిఖీలో సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ పరిధిలో మొత్తం 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. విచారణలో మూడు డ్రెడ్జింగ్ బోట్ల యజమానిగా నందూరి రాజు (మాదిగపల్లి, వైకుంఠపురం, గుంటూరు), మరో మూడు బోట్ల యజమానిగా ముత్యాల వెంకట రమణ (రామాలయం వీధి, విజ్జేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా), మరో మూడు బోట్ల యజమానిగా కూచిపూడి బాలస్వామి (గరుడాచలపాలెం, తకెళ్లపాడు, గుంటూరు జిల్లా) ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు డ్రెడ్జింగ్ బోట్లకు సంబంధించిన యజమానులు తనిఖీ సమయంలో గుర్తించబడకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నిర్ధారించారు.నూతన ఇసుక విధానం--2024 మరియు పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక త్రవ్వకాల కోసం వినియోగించినందున మొత్తం 13 బోట్లను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా తదుపరి క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, సోషల్ మీడియాలో "28 డ్రెడ్జింగ్ బోట్లు పట్టుకుని 13 మాత్రమే సీజ్ చేసి, మిగిలిన 15 బోట్లను వదిలేశారు" అనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీలో గుర్తించిన 13 డ్రెడ్జింగ్ బోట్లపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.ఈ సంయుక్త తనిఖీలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్. శివరాముడు, జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి, టెక్నికల్ అసిస్టెంట్ పి.ఎన్.వి.ఎల్. శైలజ, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ యు. రంజిత్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ఏఈఈ శివ, ఐసీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులకు 'తల్లికి వందనం' వర్తింపు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం. ఎమ్మెల్యే బొండా ఉమా




విజయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సోమవారం సెంట్రల్ నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ డ్వాక్రా పారిశుద్ధ్య కార్మికులకు "తల్లికి వందనం" పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. "తల్లికి వందనం" పథకాన్ని ప్రతి అర్హ కుటుంబానికి వర్తింపజేస్తూ మరోసారి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు.గత ప్రభుత్వం "అమ్మ ఒడి" పథకం పేరుతో అందరికీ లబ్ధి కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది కుటుంబాలను పథకం పరిధి నుంచి తప్పించి నిరాశపరిచిందని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగానే ఒక కుటుంబంలో ఎంతమంది అర్హులైన విద్యార్థులు ఉంటే అంతమందికీ "తల్లికి వందనం" పథకం వర్తింపజేస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందన్నారు.ఎన్నికల సమయంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అక్షరాలా అమలు చేస్తున్నామని, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని ఏనాడూ వమ్ము చేయబోమని ఉమా స్పష్టం చేశారు.అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ డ్వాక్రా పారిశుద్ధ్య మహిళా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మ్యాపింగ్ కావడంతో సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవుతున్నారని వారు తన దృష్టికి తీసుకురావడంతో, ఈ సమస్యను తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడడంతో పాటు ముఖ్యమంత్రి కి సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు వివరించామని, ఆ కృషి ఫలితంగానే తాజాగా విడుదలైన జీవోలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, డ్వాక్రా పారిశుద్ధ్య మహిళా కార్మికులకు కూడా "తల్లికి వందనం" పథకం వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వేలాది మంది మహిళా ఉద్యోగులు లబ్ధి పొందనున్నారని, ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని జమ చేయనుందని తెలిపారు. మహిళల సంక్షేమం, పేద కుటుంబాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మహిళలు, చిరు ఉద్యోగుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతోందని, ప్రజల సమస్యలను అసెంబ్లీలోనూ, ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం ప్రస్తావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తూనే ఉంటామని బొండా ఉమా తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు, ఎమ్మెల్యే బొండా ఉమా కు కృతజ్ఞతలు తెలుపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, సెంట్రల్ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ జీ ఆర్ ఎస్ ) కార్యక్రమానికి 140 ఫిర్యాదులు..

**- ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్ )కు సోమవారం 140 ఫిర్యాదులు రావడం జరిగినది**




( నేటి శుభోదయ జులై : 21 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డ్రా .శంఖబ్రత భాగ్చి, ఐ.పి.ఎస్., ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు ఉండి, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్హెలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమానికి 140 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ అందజేసినారు. సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

## గిరిపురం ఈఎల్ఎస్ఆర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలన.



జయవాడ, జూలై 20 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం సాయంత్రం గిరిపురంలోని ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ (జూూా=)ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి వ్యవస్థను పరిశీలించడంతో పాటు, సమీప ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి పైపులైన్ల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా రిజర్వాయర్ నుంచి సరఫరా అవుతున్న నీటిని ముందుగా నాణ్యత పరీక్షలకు నిర్వహించారు. బోర్‌వాటర్ నమూనాలను కూడా సేకరించి ప్రయోగశాలకు పంపి పరీక్షలు నిర్వహించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పరీక్షల ఫలితాలు పూర్తిగా సంతృప్తికరంగా వచ్చిన తర్వాతే సంబంధిత బోర్‌వాటర్ వినియోగాన్ని కొనసాగించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.తాగునీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కమిషనర్ అన్నారు, ప్రతి రోజు నీటి నమూనా పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక శిబిరంలో ఉన్న హెల్త్ వర్కర్లతో బరువు రికార్డ్ చేసిన నివేదికను పరిశీలించారు మన సర్వే ద్వారా అక్కడున్న పరిస్థితులను తెలుసుకున్నారు.క్షేత్రస్థాయిలో ఎక్కడైనా లోపాలు లేదా సమస్యలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు.ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ గోపాల నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.